PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి:43 సంచిక:59 | విజయవాడ, శుక్రవారం 29 సెప్టెంబర్ 2023 | 6 + 8 పేజీలు వెల: 5.50

Vol No | Vijayawada, Friday 29 September 2023 | Rs

అప్పుల భారతం

- విదేశీ రుణాలు రూ.52 లక్షల కోట్లు
- కరెంట్ ఖాతా లోటు ప్రమాద ఘంటికలు
- ఆర్‌బిఐ రిపోర్ట్‌లో వెల్లడి

5



షూటింగ్‌లో మరో స్వర్ణం

- 10మీ. ఎయిర్ పిస్టల్‌లో పసిడి
- ఈక్వెస్ట్రియన్, వుషూలో ఒక్కో పతకం

6

ఆర్‌బికెల కుదింపు

- రేషనలైజేషన్ పేరిట రెండు వేల సెంటర్లు ఎత్తివేత
- సిబ్బంది సర్దుబాటు
- భవనాలు, మౌలిక సదుపాయాల ఖర్చు వృథా
- గ్రామంలోనే రైతు సేవ లక్ష్యానికి తిలోదకాలు



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ముఖ్యమంత్రి 'మానస పుత్రికలు'గా ప్రభుత్వం చేత చెప్పబడుతున్న రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బికె) తగ్గింపునకు కసరత్తు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు వేల వరకు ఆర్‌బికెలను రద్దు పర్చేందుకు రంగం సిద్ధం చేశారు. ఆర్‌బికెల కోసం నియమితులైన అదనపు సిబ్బందిని వేరే కార్యక్రమాలకు తరలించాలని, అవసరమైన చోట సర్దుబాటు చేయాలని వ్యవసాయశాఖ కమిషనరేట్ నుంచి కిందికి ఉత్తర్వులు వెళ్లగా తగ్గింపు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. కుదింపు కార్యక్రమాన్ని రేషనలైజేషన్ (హేతుబద్ధీకరణ) అన్నారు. నెలకొల్పిన వేల ఆర్‌బికెలను ఎత్తేయడం వలన ఇప్పటి వరకు వాటిలో ఏర్పాటు చేసిన మౌలిక వసతులకు, స్వంత భవనాల నిర్మాణాలకు సర్కారు ఖర్చు చేసిన కోట్లాది రూపాయలు వృథా అవుతున్నాయి. ఆర్‌బికెల కోసం కొత్తగా నియమించిన విలేజి అగ్రికల్చర్/ హార్టికల్చర్/ సెరికల్చర్ అసిస్టెంట్ల భవితవ్యం ప్రశ్నార్థకమైంది. ఆ సిబ్బందిని ఉంచుతారా ఇంటికి పంపిస్తారా అన్న ఆందోళన నెలకొంది.

హేతుబద్ధత శూన్యం

విత్తు నుంచి పంటల విక్రయం వరకు వ్యవసాయదారుల అన్ని లావాదేవీలు, ప్రభుత్వ పథకాలు గ్రామాల్లో రైతుల చెంతనేనని వైసిపి ప్రభుత్వం 2020 మేలో ఆర్‌బికెల వ్యవస్థ తీసుకొచ్చింది. ప్రతి గ్రామ సచివాలయానికి అనుబంధంగా ఆర్‌బికె అని చెప్పింది. ఎపి వ్యాప్తంగా 10,778 సెంటర్లను నెలకొల్పింది. ప్రత్యేకంగా సిబ్బందిని నియమించింది. మూడేళ్ల అనంతరం ఇప్పుడు ఆర్‌బికెల రేషనలైజేషన్ అంటూ వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ మార్గదర్శకాలు జారీ చేశారు. సెప్టెంబర్ 15 లోపు ప్రక్రియ పూర్తి కావాలన్నారు. డిఎఓలు మరో ఒకరిద్దరు అధికారుల సహాయంతో తమ జిల్లాల్లో రేషనలైజేషన్ పూర్తి చేయాలన్నారు. అంతలోనే కమిషనరేట్‌లోనే ఆ ప్రక్రియను పూర్తి చేసి ఒకే చేయాలని కిందికి పంపి తిరిగి పైకి తెప్పించుకున్నారు. ప్రస్తుతం కమిషనరేట్‌లో తుది ఖరారు జరుగుతోంది. ప్రక్రియలో హేతుబద్ధత కొరవడిందని ఆరోపణలొస్తున్నాయి. గతంలో ఒక్కో సచివాలయం పరిధిలో ఒక ఆర్‌బికె ఉండగా రేషనలైజేషన్ అనంతరం రెండు మూడు సచివాలయాలకు ఒక ఆర్‌బికె అయింది. అర్బన్‌లో, సెమీ అర్బన్‌లో, పెద్ద గ్రామ పంచాయతీలలో ఎన్ని వార్డు సెక్రటేరియట్‌లు ఉన్నా ఒక్క ఆర్‌బికెకే పరిమితం చేశారు. ఉత్తర్వుల్లో ఒక ఆర్‌బికె పరిధిలో వెయ్యి-1,500 ఎకరాల విస్తీర్ణం ఉండాలని, ఏజెన్సీలో అయితే 600-800 ఎకరాలుగా పేర్కొనగా అందుకు విరుద్ధంగా అత్యధికంగా 3 వేల ఎకరాల వరకు, అతి తక్కువ 600 ఎకరాల కింద పరిధులు నిర్ణయించారు. పంటలతో నిమిత్తం లేకుండా వివిఎ, వివిహెచ్, విఎస్‌ఎలను కేటాయించారు. రాష్ట్రం మొత్తమ్మీద 1,500 నుంచి రెండు వేల ఆర్‌బికెలను ఎత్తేయడానికి రంగం సిద్ధం చేశారు.

వృథా ప్రయాస

అన్ని హంగులతో ఆర్‌బికెలకు సొంత భవనాల నిర్మాణం చేపట్టారు. ఇప్పటికి 10,243 బిల్డింగ్‌ల కన్‌స్ట్రక్షన్ మొదలు పెట్టగా 1,500 వరకు పూర్తయ్యాయి. మిగతావి వివిధ మిగతా 2లో

హరిత విప్లవ పితామహుడు

స్వామినాథన్ కన్నుమూత

చెన్నై : హరిత విప్లవ పితామహుడు, ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త, జన్యు శాస్త్ర నిపుణుడు ఎంఎస్. స్వామినాథన్ (98) ఇక లేరు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం ఉదయం 11.20 గంటలకు చెన్నైలోని తన స్వగృహంలో తుది శ్వాస విడిచారు. ఆహార రంగంలో దేశం స్వయం సమృద్ధి సాధించేందుకు, ఆకలిని, పేదరికాన్ని పారద్రోలేందుకు ఆయన ఎన్నో పరిశోధనలు చేశారు. అధిక దిగుబడిని అందించే వరి, గోధుమ వంగడాలను అందించి దేశానికి ఎంతో మేలు చేకూర్చారు. స్వామినాథన్‌కు ముగ్గురు కుమార్తెలు..సౌమ్య, మధుర, నిత్య...ఉన్నారు. ఆయన భార్య, విద్యావేత్త మీనా స్వామినాథన్ గత సంవత్సరమే కన్నుమూశారు. ఆయన అంత్యక్రియలు శనివారం నిర్వహించనున్నట్లు ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఎంఎస్ఆర్ఎఫ్) అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. ఎంఎస్ భౌతికకాయాన్ని శుక్రవారం నాడు ప్రజాసందర్శనార్థం ఎంఎస్ఆర్ఎఫ్‌కు తరలిస్తారు. స్వామినాథన్ అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహిస్తామని ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ప్రకటించారు. హరిత విప్లవ పితామహుని మృతి పట్ల యావత్ దేశం విచారం వ్యక్తం చేసింది. స్వామినాథన్ మరణం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీ, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్, కేరళ సిఎం పినరయి విజయన్, ఆంధ్రప్రదేశ్ గవర్నరు అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సహా వివిధ రాజకీయ, వ్యవసాయ రంగ ప్రముఖులు, ప్రభుత్వాధినేతలు, అఖిల భారత కిసాన్ సభ, వ్యవసాయ కార్మిక సంఘం సహా అనేక ప్రజా సంఘాల నాయకులు సంతాపం ప్రకటించారు. స్వామినాథన్ సేవలను కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పలువురు ప్రముఖుల సంతాపం



స్వామినాథన్ భౌతికకాయం (ఇన్‌సెట్‌లో) ఫైల్ ఫోటో

కరువు కాటకాలకు చలించి..వైద్య విద్యకు స్వస్తి చెప్పి..సేద్యానికి ఊపిరినిచ్చి..

స్వామినాథన్ 1925 ఆగస్ట్ 7న తమిళనాడులోని కుంభకోణంలో జన్మించారు. ప్రాథమిక విద్య, మెట్రిక్యులేషన్‌ను అక్కడే పూర్తి చేశారు. తండ్రి వైద్యుడు కావడంతో ఆయన కూడా వైద్య విద్యలోనే ప్రవేశించారు. అయితే 1943లో బెంగాల్‌లో సంభవించిన కరవు కాటకాలను చూసి చలించిపోయి వైద్య విద్యకు స్వస్తి చెప్పి, వ్యవసాయ రంగం వైపు అడుగులు వేశారు. త్రివేండ్రంలోని మహారాజా కళాశాలలో జువాలజీ కోర్సులో చేరి అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ పూర్తి చేశారు. ఆ తర్వాత మద్రాసు వ్యవసాయ కళాశాలలో చేరి మిగతా 5లో

సిపిఎం పొలిట్‌బ్యూరో సంతాపం

న్యూఢిల్లీ : భారతదేశంలో హరిత విప్లవానికి మార్గదర్శకుడు, ప్రఖ్యాత శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ (98) మృతికి సిపిఎం పొలిట్ బ్యూరో తన ప్రగాఢ సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేసింది. పొలిట్‌బ్యూరో ఈ మేరకు గురువారం నాడిక్కడ ఒక ప్రకటన విడుదల చేసింది. 1960 దశకంలో అధిక దిగుబడినిచ్చే గోధుమలు, వరి రకాలను అభివృద్ధి పరిచి, ప్రాచుర్యం కల్పించడంలో కీలక పాత్ర పోషించినందుకు గుర్తింపుగా 1987లో స్థాపించబడిన ప్రపంచ ఆహార బహుమతిని మొదటిసారిగా అందుకున్నారని గుర్తు చేసింది. 1988లో ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను స్థాపించారు. రైతులపై జాతీయ కమీషన్ అధ్యక్షులుగా కనీస మద్దతు ధరను అందించాలని సిఫారసు చేశారు. వ్యవసాయ ఉత్పత్తి సమగ్ర వ్యయానికి 50 శాతం అదనంగా కనీస మద్దతు ధర ఉండాలన్న స్వామినాథన్ సిఫారసు. రైతుల పోరాటాల్లో ఇప్పటికీ ఒక ముఖ్యమైన డిమాండ్‌గా ఉందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. మోడీ ప్రభుత్వం దీనిపై హామీ ఇచ్చినప్పటికీ అమలు చేయడానికి ఇష్టపడడం లేదని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

బ్లింకెన్‌తో జై శంకర్ భేటీ

- కెనడా వివాదంపైనే చర్చ

వాషింగ్టన్ : సిక్కు కార్యకర్త హత్యపై భారత్, కెనడాల మధ్య దౌత్య వివాదం నెలకొన్న నేపథ్యంలో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్‌తో గురువారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ద్వైపాక్షిక సంబంధాల అభివృద్ధి గురించి చర్చించినట్లు రొటీన్ ప్రకటనలే చేసినప్పటికీ, భారత్‌పై కెనడా చేసిన ఆరోపణల మీద వివరణ ఇవ్వడానికే జైశంకర్ ప్రయత్నించారని తెలిసింది. ఇప్పటికే కెనడా దర్యాప్తుకు సహకరించాల్సిందిగా భారత్‌ను అమెరికా కోరింది. అమెరికా తన సంప్రదాయ మిత్రదేశమైన కెనడావైపే ఎక్కువ మొగ్గు చూపుతోంది. సిక్కు కార్యకర్త హత్యను సాధనంగా చేసుకుని భారత్ ప్రభుత్వాన్ని మరింతగా లొంగదీసుకునేందుకు యత్నిస్తోంది. ఇంత జరిగిన తరువాత కూడా మోడీ ప్రభుత్వం అమెరికా అంటకాగడానికే తాపత్రయ పడుతున్నది. బ్లింకెన్, జైశంకర్ భేటీలో ద్వైపాక్షిక అంశాలపైనే చర్చించినట్లు విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ విలేకర్లకు తెలిపారు. మంగళవారం ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొన్న అనంతరం జై శంకర్ న్యూయార్క్ నుండి వాషింగ్టన్ బయలుదేరి వెళ్లారు. మొదట అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్‌సులివాన్‌తో సమావేశమయ్యారు. భారత కాలమానం ప్రకారం రాత్రి బాగా పొద్దు పోయినతరువాత బ్లింకెన్‌తో భేటీ అయ్యారు.



అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్‌తో మాట్లాడుతున్న భారత విదేశాంగ మంత్రి జైశంకర్

కెనడాలో భారత దౌత్యవేత్తలను బెదిరించారు

అంతకుముందు న్యూయార్క్‌లో జరిగిన ఓ బహిరంగ కార్యక్రమంలో జైశంకర్ మాట్లాడుతూ కెనడా లోని భారత దౌత్యవేత్తలపై బెదిరింపులు జరుగుతున్నాయని, భారత్‌లో వేర్పాటువాదాన్ని ప్రోత్సహించే శక్తులకు కెనడా పెద్దపీట వేస్తోందని ఆరోపించారు. భారత రాజకీయాల్లో బహిరంగంగా జోక్యం చేసుకోవాలనే సూచనలు కూడా వివిధ కేంద్రాల నుంచి వస్తున్నాయని ఆయన అన్నారు. కెనడా అందించే ఏవైనా ఆధారాలు లేదా సమాచారంపై దర్యాప్తు చేసేందుకు భారత్ సిద్ధంగా ఉంది. ఇతర దేశాలపై హింసకు పాల్పడడం భారత విధానం కాదని అన్నారు. ఉగ్రవాద శక్తులపై జస్టిన్ ట్రూడో ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవడం లేదని జైశంకర్ అన్నారు.

'సుప్రీం'లో సిఐడి కేవియట్ పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టయి రిమాండ్‌లో వున్న టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై తమ వాదనలు వినకుండా ఎలాంటి ఉత్తర్వులూ ఇవ్వొద్దని రాష్ట్ర ప్రభుత్వం కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. గురువారం రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎపి సిఐడి ఈ కేవియట్ పిటిషన్‌ను సుప్రీంకోర్టులో దాఖలు చేసింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు పాత్రపై ఆధారాలున్నాయని, విద్యార్థులకు శిక్షణ ఇస్తామని రూ.కోట్లు కుంభకోణం చేశారని, ఈ కేసులో తమ వాదనలు వినాలని పిటిషన్‌లో పేర్కొంది. కేంద్ర దర్యాప్తు సంస్థలు కూడా ఈ కేసులో విచారణ చేస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వ పరిధిలోని జిఎస్‌టి కౌన్సిల్ ఇచ్చిన సమాచారంతోనే ఈ కేసును ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపింది.

నాయకులపై దురుసుగా వ్యవహరించిన

పోలీసులపై చర్యలు తీసుకోవాలి

డిజిపికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష పార్టీల పిలుపు మేరకు కాకినాడలో శాంతియుతంగా ధర్నా చేస్తున్న సిపిఎం నాయకుల పట్ల దురుసుగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు డిజిపి కెవి రాజేంద్రనాథ్ రెడ్డికి ఆయన గురువారం లేఖ రాశారు. కాకినాడలో ప్రశాంతంగా ధర్నా చేయడానికి వెళ్తున్న సిపిఎం నాయకులపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించారని పేర్కొన్నారు. మహిళా నాయకులు సిహెచ్ రమణిపై సిఐ భగవాన్ చేతులు వేసి నెట్టుకుంటూ పోలీసు వాహనం ఎక్కించారని తెలిపారు. మహిళలపై పురుష పోలీసు అధికారులు ఇలా వ్యవహరించడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. ఈ అంశంపై అభ్యంతరం చెప్పిన సిపిఎం నాయకులపై డిఎస్‌పి మురళీకృష్ణా రెడ్డి దురుసుగా ప్రవర్తించారని తెలిపారు. కింది స్థాయి పోలీసులు తప్పు చేస్తే సరిచేయాల్సిన పోలీసు అధికారులే మహిళలపై, పార్టీ నాయకులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారంటే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని, వారు ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు.

పోలీసులు తమ తప్పు కప్పిపుచ్చుకునేందుకు వామపక్ష నాయకులపై కేసులు పెట్టారని వివరించారు. ప్రశాంతంగా జరుగుతున్న నిరసనలపై కూడా నిర్బంధం ప్రయోగించారని, మహిళా నాయకుల పట్ల అమానుషంగా వ్యవహరించిన పోలీసు అధికారులపై విచారణ జరిపి, తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్ఐ మెయిన్స్ పరీక్షలకు 2 నెలల గడువు పొడిగించండి

- ముఖ్యమంత్రికి లేఖ

2



హైదరాబాద్‌లో గణేశుని శోభాయాత్ర. (ఇన్‌సెట్లో) ఖైరతాబాద్ విగ్రహం నిమజ్జనం

నిమజ్జనం ప్రశాంతం

- కన్నులపండువగా ఖైరతాబాద్ మహాగణపతి శోభాయాత్ర

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

భాగ్యనగరంలో గణేష్ నిమజ్జనం గురువారం కోలాహలంగా జరిగింది. ట్యాంక్‌బండ్, సరూర్ నగర్ చెరువులతోపాటు హైదరాబాద్‌లో 33 చెరువుల్లో నిమజ్జనం జరిగింది. ఈ ఏడాది దశ మహా విద్యా గణపతిగా భక్తులకు దర్శనమిచ్చిన 63 అడుగుల ఖైరతాబాద్ మహాగణపతి శోభాయాత్ర ప్రశాంతంగా జరిగింది. ఉదయం ఆరు గంటలకు ప్రారంభమైన ఊరేగింపు మధ్యాహ్నం 12 గంటలకు ఎన్‌టిఆర్ మార్గ్‌కు చేరుకుంది. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో అంబేద్కర్ విగ్రహం సమీపంలోని నాలుగో నంబర్ క్రేన్ వద్ద భారీ గణేశుడిని నిమజ్జనం చేశారు.

బండ్లగూడ జాగీర్‌లోని కీర్తి రిచ్మండ్ విల్లాస్‌లో జరిగిన వేలంలో వినాయకుడి లడ్డూ ఏకంగా రూ.1.26 కోట్లు ధర పలికింది. బాలాపూర్ లడ్డూను ఈసారి తుర్కయాంజల్‌కు చెందిన దాసరి దయానంద రెడ్డి రూ.27 లక్షలకు దక్కించుకున్నారు.

బాలికపై అత్యాచారం, ఆపై హత్య

- చిన్నాన్న ఘాతుకం

ప్రజాశక్తి- భీమవరం రూరల్

తండ్రి తరువాత తండ్రిలా చూసుకోవాల్సిన చిన్నాన్న దారుణానికి ఒడిగట్టాడు. అన్న కూతురిపై అత్యాచారం చేసి ఆపై దారుణంగా హత్య చేశాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ దారుణ ఘటన భీమవరంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... భీమవరం పట్టణంలోని లెప్రసీ కాలనీకి చెందిన అంజిబాబు, అరుణ దంపతుల ఒక్కగానొక్క కుమార్తె (14) స్థానిక లూథరన్ హైస్కూల్లో ఏడో తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఎప్పటిలాగానే ఈ నెల 26న ఉదయం కూలి పనులకు వెళ్లారు. ఇదే అదునుగా రత్నకుమారి చిన్నాన్న మునుపు మావుళ్లు(37) భావించాడు. ఆ ఇంట్లోకి ప్రవేశించి బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆమె కేకలు వేయడం, ఎవరికైనా చెబుతుందనే భయంతో హత్య చేసి మృతదేహాన్ని ఇంటి వెనుక ఉన్న తుప్పల్లో పడేశాడు. కూలి పనులకు వెళ్లి సాయంత్రానికి తిరిగివచ్చిన తల్లిదండ్రులకు కుమార్తె కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మరుసటిరోజు ఉదయం భీమవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఇవన్నీ మిగతా 2లో

కౌలు రైతులపై నిర్లక్ష్యం

- 25 లక్షల మందిలో 7.50 లక్షల మందికే గుర్తింపు
- 2.48 లక్షల మందికే రుణాలు


ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో కౌలు రైతులకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు, వ్యవసాయ శాఖాధికారులు చొరవ చూపడం లేదు. సాగు పెట్టుబడి కోసం కౌలు రైతులు ప్రయివేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. రాష్ట్ర రుణ ప్రణాళికలో కనీసం పది శాతం తగ్గకుండా కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని నాలుగేళ్ల క్రితమే రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం నిర్ణయించింది. క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. దీంతో, కౌలు రైతులు సంక్షోభంలో చిక్కుకున్నారు. సాగుకు పెట్టుబడులు పెరుగుతున్నాయి. ఆదాయం తగ్గిపోతోంది. ప్రభుత్వం నుంచి కౌలు రైతులకు భరోసా కొరవడింది. గత మూడేళ్లతో పోలిస్తే ఆ ఏడాది రుణాలు అందిన కౌలు రైతుల సంఖ్య పెరిగినా అందిన రుణం మొత్తం గణనీయంగా తగ్గిపోయింది. రాష్ట్రంలో దాదాపు 25 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు. వీరిలో ఆరున్నర లక్షల నుంచి ఏడు లక్షల మందికి మాత్రమే ప్రభుత్వం ఏటా సిసిఆర్‌సి కార్డులు ఇస్తోంది. ఈ ఏడాది 7.50 లక్షల మందికి ఇచ్చింది. వీరిలో 1.46 లక్షల మందికి మాత్రమే రైతు భరోసా నిధులు వారి ఖాతాల్లో జమ అయ్యాయి. 2011 కౌల్దారి చట్టం స్థానే వైసిపి ప్రభుత్వం 2019లో కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం కౌలు రైతులకు ఏ సాయం కావాలన్నా భూ యజమాని అంగీకారం తప్పనిసరిగా మారింది. భూ యజమాని అంగీకారపత్రంతో సాగు ధ్రువీకరణ పత్రాలు (సిసిఆర్‌సి) జారీ చేయాలని నిబంధన విధించింది. భూ యజమానులు ముందుకు రాకపోవడంతో సిసిఆర్‌సి జారీ ప్రక్రియ పూర్తి స్థాయిలో జరగడం లేదు. సాగు ధ్రువీకరణ పత్రాలు రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికారులు జారీ చేసినా బ్యాంకర్లు రుణాలు ఇవ్వడానికి ఆసక్తి చూపడం లేదు. రాష్ట్రం మొత్తమ్మీద ఈ ఏడాది 7.50 లక్షల మందికి సిసిఆర్‌సిలు ఇవ్వగా, ఇప్పటి వరకు వారిలో మిగతా 5లో

కౌలు రైతులకు గత ఐదేళ్లలో అందిన రుణాల వివరాలు

సంవత్సరం	రుణ మొత్తం	కౌలు రైతులు
2019-20	రూ.2309 కోట్లు	3.88 లక్షల మంది
2020-21	రూ.1055 కోట్లు	1.96 లక్షల మంది
2021-22	రూ. 1744 కోట్లు	1.80 లక్షల మంది
2022-23	రూ.1566 కోట్లు	1.48 లక్షల మంది
2023-24	రూ.659 కోట్లు	2.48 లక్షల మంది

కౌలు రైతులందరికీ పంట రుణాలు ఇవ్వాలి



భూ యజమానులకు రుణాలు ఇస్తున్న బ్యాంకర్లు వాస్తవ సాగుదారులుగా ఉన్న కౌలు రైతులకు రుణాలు ఇవ్వకపోవడం దారుణం. భూ యజమానికి భూమిపై రుణం ఇచ్చి పంటలపై కౌలు రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కింద రుణాలు ఇవ్వాలి. ఎకరాకు గరిష్టంగా రూ.1.60 లక్షల రుణం మంజూరు చేయాలి. ఒక్కో జెఎల్‌బి గ్రూపునకు రూ.8 లక్షలు హామీలేని రుణం ఇవ్వాలి. పంటలు సాగు చేస్తున్న కౌలు రైతులను బ్యాంకర్లు, వ్యవసాయ శాఖాధికారులు విస్మరించడం తగదు. వారికే అన్ని సదుపాయాలూ కల్పించాలి. ప్రభుత్వం సిసిఆర్‌సి ఇచ్చిన ప్రతి కౌలు రైతుకూ ఇకెవైసి, ఇ-క్రాప్ చేసి పంట కొనుగోలు, బీమా సదుపాయాలు వర్తింపచేయాలి.

వై.రాధాకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు, ఎపి కౌలు రైతు సంఘం

మంత్రి జోగి వ్యక్తిగత ఫొటోగ్రాఫర్ కేసులో ట్విస్ట్

- ఆత్మహత్య చేసుకుంటున్నానని నమ్మించి పరారీ

ప్రజాశక్తి - కోడూరు

మంత్రి జోగి రమేష్ వ్యక్తిగత ఫొటోగ్రాఫర్ ఆదినారాయణ అదృశ్యం కేసులో బిగ్ ట్విస్ట్ చోటుచేసుకుంది. తాను చనిపోతున్నట్లు అందరినీ నమ్మించి పరారైనట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. రెండురోజులుగా గాలించినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో సిసి కెమెరా పుటేజీలను పరిశీలించారు. కృష్ణా జిల్లా కోడూరు మండలం చిన్నాపురం వద్ద తన ద్విచక్ర వాహనానికి బ్యాగ్ తగిలించుకుని ఫోన్‌లో మాట్లాడుకుంటూ బైక్‌పై వెళ్తున్నట్లు ఇందులో రికార్డు అయి ఉంది. అనంతరం తన ద్విచక్ర వాహనాన్ని ఉల్లిపాలెం-భవానీపురం వారధి వద్ద పార్కింగ్ చేశారు. తాను చనిపోతున్నట్లు సూసైడ్ నోట్ రాసి ద్విచక్ర వాహనంలో ఉంచారు. అక్కడి నుంచి తన బ్యాగుతో నడుచుకుంటూ కోడూరు గంగానమ్మ సెంటర్‌కు చేరుకుని ఆటో కోసం నిరీక్షిస్తున్నట్లుగా సిసి పుటేజీలో కనిపించింది. నైట్ టీ షర్ట్, షార్ట్ వేసుకుని, తలకు క్యాప్ పెట్టుకున్నాడు. ఎవరికీ తన ముఖం కనిపించకుండా ఉండేందుకు మాస్క్ ధరించారు. దీంతో, ఆదినారాయణ ఆత్మహత్య చేసుకోలేదని, చనిపోతున్నట్లు అందరినీ నమ్మించి పరారయ్యాడని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చురు. అప్పుల వాళ్ల నుంచి తప్పించుకోవడానికి ఈ విధంగా పక్కా ప్రణాళిక రచించాడని పోలీసులు నిర్ధారించారు.

విచారణకు చంద్రబాబు సహకరించాలి

- ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిఐడి నమోదు చేసిన కేసుల్లో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు తప్పు చేయలేదనుకుంటే విచారణకు పూర్తిగా సహకరించాలని వైసిపి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. క్విడ్ ప్రోకో కింద రాష్ట్ర నిధుల్ని చంద్రబాబు దోచేశారని విమర్శించారు. చంద్రబాబు చేసిన స్కాములు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని, అందుకే అసెంబ్లీలో చర్చ అనగానే టిడిపి ఎమ్మెల్యేలు పారిపోయారని ఆరోపించారు. స్కామ్‌లను అధికారులు బయటపెడితే.. రాజకీయ కక్ష సాధింపు అంటూ మాట్లాడటం సరైంది కాదని అన్నారు.

వృద్ధులకు మరింత రక్షణ

- ఆరోగ్యం, భద్రతపై శ్రద్ధ
- వచ్చే నెలలో భేటీ కానున్న స్టేట్ కౌన్సిల్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

వృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఇటీవల ఏర్పాటుచేసిన స్టేట్ కౌన్సిల్ ప్రత్యేకంగా భేటీ కానుంది. ఇది తొలి భేటీ కావడం గమనార్హం. అక్టోబరు ఐదో తేదీన ఈ సమావేశం జరగనుంది. దీనికోసం అజెండాను అధికారులు సిద్ధం చేశారు.

వృద్ధుల అంశాలపై చర్చించేందుకు ముందుగా ఆరు అంశాలతో అజెండా సిద్ధం చేశారు. వృద్ధుల అంశాలను పరిష్కరించేందుకు, వారికి అవసరమైన చేయూతను అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు. అలాగే వారి సమస్యలను పరిష్కరించేందుకు ట్రిబ్యునల్స్, అప్పిలేట్ అథారిటీలను ఏర్పాటుచేసేందుకు ఈ సమావేశంలో నిర్ణయాలు తీసుకోవాలని భావిస్తున్నారు. వృద్ధులకు కావాల్సిన వైద్య సహాయానికి చేయాల్సిన ఏర్పాట్లు, అందుకు తీసుకోవాల్సిన చర్యలపైనా సమీక్షించనున్నారు. వృద్ధులకు అందించాల్సిన జీవిత భద్రత, వారి ఆస్తుల రక్షణ వంటివి కూడా చర్చించాలని అజెండాలో చేర్చారు. వారి దక్షత చూసేందుకు ఎవరూ లేని పరిస్థితుల్లో వారికి ఏర్పాటుచేసిన ఓల్డేజ్ హోమ్‌ల పరిస్థితి, వాటిని మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపైనా కీలక నిర్ణయాలు తీసుకోవాలని భావిస్తున్నారు. ఇదే సమయంలో వారికి అందిస్తున్న వృద్ధాప్య పింఛను సకాలంలో అందించడం ద్వారా కష్టాల్లో ఉన్నవారికి మేలు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపైనా సమీక్షించాలని నిర్ణయించారు. ఇవి కాకుండా మరిన్ని అంశాలను అజెండాలో చేర్చాలని భావిస్తున్నారు.

ఆర్‌బికెల కుదింపు

(మొదటి పేజీ తరువాయి)

దశల్లో ఉన్నాయి. సగానికిపైన ఆర్‌బికెలు ఇప్పటికీ అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ప్రభుత్వం నెలల పర్యంతం అద్దెలు బకాయి పడింది. కాగా రేషనలైజేషన్‌లో సొంత భవనం ఉన్న ఆర్‌బికెలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎత్తేసే ఆర్‌బికెల కోసం చేపట్టిన నిర్మాణాలను ఏం చేస్తారనే ప్రశ్న వస్తోంది. అలానే వదిలేస్తే ఖర్చు చేసిన నిధులు నిరుపయోగమవుతాయి. అన్ని ఆర్‌బికెలలో కియోస్క్, టివి, కంప్యూటర్లు, విలువైన ఫర్నీచర్ ఏర్పాటుకు బాగానే ఖర్చు చేశారు. ఒక్కొక్క ఆర్‌బికెలో మౌలిక వసతులకు కనీసం రూ.10 లక్షల వరకు వ్యయం చేశారని అంచనా. ఉన్నపళాన వేల ఆర్‌బికెలను ఎత్తేస్తే ఆ పరికరాల పరిస్థితేంటో అర్థం కాకుండా ఉంది. ఆర్‌బికెల కోసం 6,758 వివిఎలు ఉన్నారు. హార్టికల్చర్ పంటలు అధికంగా ఉన్న చోట వివిహెచ్‌లు, సెరికల్చర్ ప్రాంతాల్లో విఎస్‌ఎలను నియమించారు. ఇంకా కొన్ని అర్‌బికెలలో సిబ్బంది లేరు. ఎఇఒలు, ఎంపిఇఒలను వేశారు. రేషనలైజేషన్‌లో అర్బన్ ఆర్‌బికెలలో తప్పనిసరిగా ఎఇఒలు, ఎంపిఇఒలనే వేయాలని నిబంధన పెట్టారు. అదనపు సిబ్బందిని అవసరాలకనుగుణంగా సర్దుబాటు చేయమన్నారు.

విద్యతోనే దేశాభివృద్ధి

- యుటిఎఫ్ జాతాల్లో నాయకులు
- 1న విజయవాడలో సభ

ప్రజాశక్తి - యంత్రాంగం

ఏ దేశమైన అభివృద్ధి చెందాలంటే అది విద్యతోనే సాధ్యమని యుటిఎఫ్ నేతలు అన్నారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా అనంతపురంలో ప్రారంభమైన బైక్ జాతా పల్నాడు జిల్లాకు, శ్రీకాకుళం ఇచ్ఛాపురంలో ప్రారంభమైన జాతా ఏలూరు జిల్లాలో గురువారం సాగింది. పల్నాడు జిల్లా నరసరావుపేట, వినుకొండ, పిడుగురాళ్ల పట్టణాల్లో బైక్ జాతా జరిగింది. ఆయా ప్రాంతాల్లో జాతాకు ఉపాధ్యాయులు భారీగా హాజరై బైక్ ర్యాలీతో ఘనస్వాగతం పలికారు. నరసరావుపేటలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో సంఘం పతాకాన్ని సీనియర్ నాయకులు సుధాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సామాజిక అంతరాలను తొలగించడానికి విద్య ప్రధాన మార్గమని, అటువంటి విద్యారంగాన్ని నాణ్యమైన ప్రమాణాలతో ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని తెలిపారు. విద్యారంగ వికాసం, ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యంగా యుటిఎఫ్ పని చేస్తోందన్నారు.



పల్నాడు జిల్లా నరసరావుపేటలో బైక్ ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు

పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయులను పాఠశాల ముఖ్య కార్యదర్శి భయభ్రాంతులకు గురి చేయడం సరికాదని, సమాజంలో ఉపాధ్యాయులను తక్కువ చేసి చూపడం విద్యారంగానికి నష్టమని తెలిపారు. ఈ ఏడాది 3.50 లక్షల మందికిపైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలను వదిలి వెళ్లారని, దీనిపై ప్రభుత్వం సమీక్షించాలని కోరారు.

స్వర్ణోత్సవాల ప్రచార జాత ముగింపు సందర్భంగా అక్టోబర్ 1న విజయవాడ సిద్ధార్థ కళాశాలలో నిర్వహించే సభకు ఉపాధ్యాయులు వేలాదిగా తరలిరావాలని కోరారు.

ఏలూరు జిల్లాలో ద్వారకా తిరుమల, జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం మీదుగా చింతలపూడి వరకు సాగింది. చింతలపూడిలో యుటిఎఫ్ పతాకాన్ని ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్-ఎస్.ప్రసాద్ ఆవిష్కరించి మాట్లాడారు. విద్యారంగ పరిరక్షణకు ఉద్యమాలు చేయడంతోపాటు సమాజానికి సేవ చేయడంలోనూ యుటిఎఫ్ ముందుందన్నారు. ఒపిఎస్ సాధన కోసం కలిసి వచ్చే అన్ని సంఘాలతో కలిసి పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని బలహీనపరిచే జాతీయ నూతన విద్యా విధానాన్ని పునఃపరిశీలించి, మేధావులు, విద్యార్థులతో చర్చించి కామన్ స్కూల్ విధానాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు.

ప్రజల భాగస్వామ్యంతో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

- వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజల భాగస్వామ్యంతో జగనన్న ఆర్యోగ సురక్ష పథకాన్ని విజయవంతం చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని కోరారు. ఈ నెల 30 నుంచి రాష్ట్రవ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభం కానున్న నేపథ్యంలో గురువారం జిల్లా వైద్యశాఖాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వ వైద్యాన్ని ప్రజలకు మరింత చేరువచేసే అవకాశం వచ్చిందన్నారు. ఇప్పటికే గ్రామాల్లో ఫేజ్-1 సర్వే పూర్తయిందని చెప్పారు. ఫేజ్-2, 3 సర్వే పనులు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. అన్ని సర్వేలూ పక్కాగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్యాంపులో భాగంగా ఏడు రకాల వైద్య పరీక్షలు చేయడంతోపాటు ఏకంగా 118 రకాల మందులను అందుబాటులో ఉంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఆరోగ్యశ్రీ పథకంపై పూర్తి అవగాహన కల్పించేలా ఇంటింటికీ వలంటీర్లు కరపత్రాలను పంపిణీ చేయాలని మంత్రి ఆదేశించారు. ఇంటింటి సర్వే సమయంలో ఆరోగ్య శ్రీ యాప్‌ల గురించి అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించే తేదీలకు సంబంధించి ముందస్తుగా దండోరా వేయించాలన్నారు. వైద్యారోగ్యశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలన్నారు. తను కూడా క్యాంపులను సందర్శించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వైద్యారోగ్యశాఖ కమిషనరు జె నివాస్, ఆరోగ్య శ్రీ సిఇఒ హరీంద్ర ప్రసాద్, డిహెచ్ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ మెయిన్స్ పరీక్షలకు 2 నెలల గడువు పొడిగించండి

- సిఎంకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎస్ఐ పోస్టులకు అక్టోబరు 14, 15 తేదీల్లో జరిగే మెయిన్స్ పరీక్షలను రెండు నెలలపాటు వాయిదా వేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. దేహదారుఢ్య పరీక్షలు ముగిశాక అభ్యర్థులు పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు కనీసం రెండు నెలల గడువును ఇవ్వకుండా కేవలం 20 రోజులు మాత్రమే ఇవ్వడం సరైంది కాదని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శ్రీనివాసరావు లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా 6,100 పోలీస్ కానిస్టేబుల్స్, 410 ఎస్ఐ పోస్టులకు 2022 నవంబరు 28న నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన నాలుగేళ్ల తర్వాత విడుదలైన ఈ నోటిఫికేషన్‌లో తక్కువ పోస్టులు వున్నాయని గుర్తుచేశారు. బోర్డు షెడ్యూల్ ప్రకారం మార్చి ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన ఎస్ఐ అభ్యర్థులకు ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించాలని, ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా వాయిదా వేశారన్నారు. విశాఖపట్నం, ఏలూరు, గుంటూరు, కర్నూలు నగరాల్లో దేహదారుఢ్య పరీక్షలను సెప్టెంబరు మొదటి వారం నుంచి 25 వరకూ నిర్వహించారని తెలిపారు. మెయిన్స్ పరీక్షలకు కేవలం 20 రోజులు మాత్రమే ప్రిపరేషన్‌కు గడువు వుంటుందన్నారు. దీంతో అభ్యర్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రిలిమ్స్ పరీక్షల్లో ఎనిమిది ప్రశ్నలు తప్పుగా ఉన్నాయని కొంతమంది అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారన్నారు. సమస్యను పరిష్కరించి వారికి న్యాయం చేయాలన్నారు. ఎత్తు కొలతలను కొలిచే సెన్సార్ లోపంతో 2018లో ఎత్తు విషయంలో అర్హత సాధించినవారు ఇప్పుడు అర్హత కోల్పోయారని తెలిపారు. ఒకే మిషను రెండు రకాలుగా చూపడం వల్ల అభ్యర్థులకు అన్యాయం జరిగిందన్నారు.

ఇలాంటి సమస్యలను సరిదిద్దాలని కోరారు. ఎత్తు విషయంలో సమీక్షించాలని కోరుకున్న అభ్యర్థులకు తిరిగి మాన్యువల్‌గా ఈవెంట్స్ నిర్వహించాలన్నారు.

స్వామినాథన్ లేని లోటు పూడ్చలేనిది

- గవర్నరు, సిఎంతో సహా పలువురు సంతాపం

ప్రజాశక్తి - యంత్రాంగం

హరిత విప్లవ పితామహుడు, పద్మవిభూషణ్ ఎంఎస్ స్వామినాథన్ లేని లోటు పూడ్చలేనిదని గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సహా పలువురు పేర్కొన్నారు.

ఈ మేరకు గురువారం వేర్వేరు ప్రకటనల్లో తమ సానుభూతిని తెలియజేశారు. స్వామినాథన్ మృతి పట్ల గవర్నరు విచారం వ్యక్తం చేశారు.

మహోన్నత వ్యక్తి స్వామినాథన్

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

దేశంలో ఆహారోత్పత్తిని పటిష్టం చేసి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను సుసంపన్నం చేసిన మహోన్నతుడు ఎంఎస్ స్వామినాథన్. ఆయన మృతికి సంతాపం తెలియజేస్తున్నాను. ఆయన స్మృతి చిరస్థాయిగా నిలిచింది.

స్వామినాథన్ మృతి కలచి వేసింది

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, ప్రధాన కార్యదర్శి లోకేష్

రైతు బాంధవుడు. ఆయన మృతి ఎంతగానో కలచి వేసింది. ప్రపంచంలో పేదరికం, ఆకలి తగ్గించడమే లక్ష్యంగా నిరంతరం శ్రమించారు. వ్యవసాయ రంగంపై చెరగని ముద్ర వేశారు.

సిఫార్సులు నేటికీ అనుసరణీయం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

స్వామినాథన్ సిఫార్సులు అత్యంత విలువైనవి. నేటికీ అనుసరణీయమైనవి. ఆయన చేసిన కృషికి దేశ, విదేశాల్లో అనేక అవార్డులు పొందారు. ఆయన మృతి రాష్ట్రానికే కాదు యావత్ భారతదేశానికి తీరని లోటు. మృతిపట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ సంతాపం తెలియజేస్తుంది.

వ్యవసాయ రంగానికి తీరని లోటు

- జనసేన అధినేత పవన్‌కల్యాణ్

వ్యవసాయ రంగానికి తీరని లోటు. రీసెర్చ్ ఫౌండేషన్ ద్వారా ఎన్నో పరిశోధనలు చేయడమే కాకుండా వాతావరణ మార్పులపై అధ్యయనాలు చేయడం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మడ అడవులను సంరక్షించడంలో కృషి చేశారు.

రైతాంగ ఆత్మహత్యల నివారణకు అనేక సూచనలు

సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగేశ్వరరావు, నరసింగరావు

రైతాంగ ఆత్మహత్యలను నివారించడానికి అనేక విలువైన సూచనలు చేశారు. వ్యవసాయ రంగం సంక్షోభం నుంచి బయటపడటానికి స్వామినాథన్ సూచనలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలి. ఆయన మృతిపట్ల సంతాపం తెలియజేస్తున్నాం.

వ్యవసాయ రంగం అభివృద్ధికి జీవితం అంకితం చేశారు

- జెవివి రాష్ట్ర అధ్యక్షులు గేయానంద్, ప్రధాన కార్యదర్శి రామారావు

భారత వ్యవసాయ రంగం అభివృద్ధి కోసమే జీవితం అంకితం చేశారు.

వ్యవసాయ రంగం క్రమేణా కార్పొరేట్ రంగం వశం అవుతున్న నేటి సందర్భంలో స్వామినాథన్ కృషికి, సిఫార్సులకు మరింత ప్రాసంగికత ఉంది. ఆయన మృతికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాం.

పాటూరు రామయ్య సంతాపం

ఎంఎస్ స్వామినాథన్‌తో కలిసి పనిచేసిన రోజులు గుర్తుకొస్తున్నాయి. ఆయన మృతి పట్ల సంతాపం తెలియజేస్తున్నాను. కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నాను.

పరిశోధనలకు మార్గదర్శి

- బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి

వ్యవసాయ రంగంలో పరిశోధనలకు ఆయనో మార్గదర్శి. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.



గుర్రం జాషువా జయంతి సభలో మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున

సామాజిక రుగ్మతలపై పోరుబావుటా

- గుర్రం జాషువా జయంతి సభలో మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమాజంలో అంటరానితనం, వివక్ష వంటి రుగుతలను తన రచనల ద్వారా గుర్రం జాషువా ఎండగట్టారని వ్యవసాయశాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో గుర్రం జాషువా జయంతి కార్యక్రమం గురువారం జరిగింది. జాషువా విగ్రహానికి మంత్రులు మేరుగ నాగార్జున, ఆదిమూలపు సురేష్, ఎంపి నందిగం సురేష్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేరుగ నాగార్జున, ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ.. గుర్రం జాషువా జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా చేపట్టాలని నిర్ణయించినందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. జాషువా రచించిన రచనలు గబ్బిలం, క్రీస్తు చరిత్ర, పిరదౌసి వంటి గొప్ప గ్రంథాలను అన్ని భాషల్లో అనువాదం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

టిడిపి కార్యాలయంలో..

జాషువా జయంతి వేడుకలు టిడిపి కార్యాలయంలో ఘనంగా జరిగాయి. జాషువా చిత్రపటానికి ఆ పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. జాషువా సాహిత్యం నేటి తరం చదవాల్సిన అవసరం ఉందన్నారు. కులభావన ఉన్న భారతదేశంలో సాంఘిక విప్లవం రావాల్సిన అవసరం ఉందని జాషువా చెప్పారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎమ్మెల్సీ పి అశోక్ బాబు, మాజీ ఎమ్మెల్సీ ఎఎస్ రామకృష్ణ, మీడియా కో-ఆర్డినేటర్ దారపనేని నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

కెవిపిఎస్ ఘన నివాళి

జాషువాకు కెవిపిఎస్ ఘనంగా నివాళు లర్పించింది. తాడేపల్లిలోని ముగ్గు రోడ్డులో ఆయన విగ్రహానికి కెవిపిఎస్ నాయకులు పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, డివైఎఫ్ఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎం సూర్యారావు, నాయకులు బూరగ వెంకటేశ్వరరావు, బర్న బాసు విజయ్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇద్దరు మృతి

- మరో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి (కాకినాడ జిల్లా)



శ్రావణి (ఫైల్)



చినబాబు (ఫైల్)

యు.కొత్తపల్లి మండలం వాకతిప్పలో గ్యాస్ సిలిండర్ పేలి ఇద్దరు మరణించారు. మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వాకతిప్ప గ్రామ వైస్ సర్పంచ్ మామిడి మల్లిబాబు కుమార్తె భవాని తన కుమార్తె శ్రావణి (14)తో కలిసి నాన్న గారి ఇంట్లో ఉంటున్నారు. గురువారం సెలవు దినం కావడంతో వంట చేస్తున్న అమ్మకు శ్రావణి సహాయం చేసింది. ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ పేలడంతో శ్రావణి(14) అక్కడికక్కడే మరణించగా, మల్లిబాబు చిన్న కుమారుడు చినబాబు (27), కుమార్తె భవాని, మల్లిబాబు తమ్ముడి కుమారుడు అజయ్, ఆయన భార్య లక్ష్మి గాయపడ్డారు. చినబాబు కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించారు. ఈ ప్రమాదంలో ఇల్లు, సామగ్రి పూర్తిగా ధ్వంసం అయ్యాయి.

బాలికపై అత్యాచారం, ఆపై హత్య

(మొదటి పేజీ తరువాయి)

గమనిస్తున్న మావుళ్లు తనకేమీ తెలియనట్టు తను కూడా బాలిక కోసం వెతకసాగాడు. ఇంటి వెనుక తుప్పల్లో బాలిక మృతదేహం కనిపించింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అప్పటికే మావుళ్ల తీరుపై అనుమానం ఉండడంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించడంతో అసలు విషయం బయటపడింది. మావుళ్ల భార్య దుబాయ్‌లో ఉంటున్నారు. వారి ఇద్దరు పిల్లలూ హాస్టల్లో చదువుతున్నారు. జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, డిఎస్‌పి శ్రీనాథ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఉక్కు నగరంలో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

స్టీల్‌ప్లాంట్‌పై కుట్రలను తిప్పికొడతాం

- ఉక్కు రక్షణ యాత్రలో సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - గాజువాక, ఉక్కునగరం విలేకరులు (విశాఖపట్నం)

కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను బలహీన పరిచేందుకు చేస్తోన్న కుట్రలను ఐక్య పోరాటాలతో, ప్రజల సహకారంతో తిప్పికొడతామని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. ఉక్కు పరిరక్షణ కోసం సిపిఎం చేపట్టిన ఉక్కు రక్షణ యాత్ర గురువారం గాజువాక నియోజకవర్గంలో ఉత్సాహపూరిత వాతావరణంలో తొమ్మిదో రోజు సాగింది. స్టీల్‌ప్లాంట్ కొవ్వొత్తుల జంక్షన్ వద్ద ప్రారంభమైన ఈ యాత్ర దుర్గానగర్, దిబ్బపాలెం, శ్రీరామనగర్, శ్రీనగర్, వడ్లపూడి, ఫకీర్‌తక్యా, తోకాడ సమైక్య అపార్టుమెంట్, పెదగంట్యాడ, గాజువాక తదితర ప్రాంతాల మీదుగా అక్కిరెడ్డిపాలెం వరకు కొనసాగింది. ఎక్కడికక్కడ ఈ యాత్రకు అపూర్వ స్వాగతం లభించింది. ఆయా చోట్ల జరిగిన సభల్లో నర్సింగరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవడం ద్వారానే రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోగలమని తెలిపారు. రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు స్టీల్‌ప్లాంట్ రక్షణ విషయంలో చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదన్నారు. రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని పల్లెత్తు మాట అనకపోవడం దారుణమన్నారు. ఉక్కు ఉత్పత్తికి కేంద్రం ఎలాంటి అవరోధాలు సృష్టిస్తోందో తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌లోని కీలక విభాగమైన బ్లాస్ట్ ఫర్నేస్ - 3ని, ఆక్సిజన్ ప్లాంట్‌ను ప్రయివేటు వారికి కట్టబెట్టేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ ప్రభుత్వ రంగ పరిశ్రమలు ఉంటేనే రిజర్వేషన్లు పటిష్టంగా అమలవుతాయని తెలిపారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో విశాఖ ఉక్కు కర్మాగారం కీలకపాత్ర పోషించిందన్నారు. యాత్రలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కెఎం.శ్రీనివాసరావు, బి.జగన్, తదితరులు పాల్గొన్నారు.



కడపలో యుటిఎఫ్ భవనం ఎదుట జిపిఎస్ ప్రతులను దగ్ధం చేస్తున్న ఉపాధ్యాయులు

ఒపిఎస్ అమలు చేయాల్సిందే

- ఉపాధ్యాయుల ఆందోళనలు
- జిపిఎస్ బిల్లు ప్రతులు దగ్ధం

ప్రజాశక్తి-యంత్రాంగం

ఒపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు గురువారం పలు జిల్లాల్లో ఆందోళనలు చేశారు. అసెంబ్లీలో ఆమోదించిన జిపిఎస్ ప్రతులను దగ్ధం చేసి నిరసనలు తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సిపిఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల అధికారం తరువాత జిపిఎస్‌ను తీసుకొచ్చి ఉపాధ్యాయులను, ఉద్యోగులను మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. విజయనగరం కలెక్టరేట్ వద్ద ఎపి సిపిఎస్ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో జిపిఎస్ బిల్లు ప్రతులను దగ్ధం చేశారు. మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. పాత పెన్షన్ ఇస్తామన్న హామీని నమ్మి అధికారం ఇచ్చినందుకు తమకు తగిన శాస్తి జరిగిందంటూ చెప్పులతో కొట్టుకున్నారు. అనంతపురం టవర్‌క్లాక్ సర్కిల్‌లో జిపిఎస్ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ ఒపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లా అనంతగిరి మండలం చిలకలగెడ్డ పాఠశాల ఆవరణలో, కడప యుటిఎఫ్ భవన్ ఎదుట, అన్నమయ్య జిల్లా మదనపల్లెలో జిపిఎస్ ప్రతులను దగ్ధం చేశారు.

బ్రాహ్మణితో 'యువగళం' కొనసాగింపు?

- లోకేష్ అరెస్టయితే నిర్వహించాలని టిడిపి ఆలోచన
- నేటి నుంచి ప్రారంభం కావాల్సిన పాదయాత్ర వాయిదా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రను నారా బ్రాహ్మణితో కొనసాగించాలని టిడిపి ఆలోచిస్తోంది. జనవరి 27న చిత్తూరులో ప్రారంభమైన లోకేష్ యాత్ర టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టుతో ఈ నెల 9న నిలిచిన విషయం తెలిసిందే. ఈ పాదయాత్ర శుక్రవారం నుంచి తిరిగి ప్రారంభమవుతుందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు రెండు రోజుల క్రితం వెల్లడించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు సుప్రీంకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు తీర్పు వచ్చే వరకు లోకేష్ ఢిల్లీలోనే ఉంటారని టిడిపి నేతలు చెబుతున్నారు. పాదయాత్రలో ఉంటే న్యాయవాదులతో సంప్రదింపులు, ఇతర కార్యక్రమాల పర్యవేక్షణ కష్టమవుతుందని, కావున పాదయాత్రను వాయిదా వేసుకోవాలని టిడిపి నేతలు లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో శుక్రవారం నుంచి తిరిగి ప్రారంభం కావాల్సిన పాదయాత్ర వాయిదా పడింది. మరోపక్క అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో లోకేష్‌ను ఎపి సిఐడి 14వ నిందితుడిగా చేర్చిన విషయం తెలిసిందే. లోకేష్‌ను ఎప్పుడైనా అరెస్టు చేసే అవకాశం ఉందని అధికార పార్టీ నేతలు పదేపదే ప్రకటనలు చేస్తున్నారు. లోకేష్ అరెస్టయినా బ్రాహ్మణితో యాత్ర నిర్వహించాలని టిడిపి నేతలు ఆలోచన చేస్తున్నారు. రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న చంద్రబాబుతో అచ్చెన్నాయుడు, చంద్రబాబు భార్య భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణి ఈ నెల 25న ములాఖత్ అయిన విషయం తెలిసిందే. లోకేష్ అరెస్టు జరిగితే బ్రాహ్మణితో యాత్ర నిర్వహించాలని ఈ ములాఖత్‌లో చర్చ జరిగినట్లు సమాచారం. చంద్రబాబు జైలు నుంచి రావడం ఆలస్యమైతే భువనేశ్వరితోనూ పార్టీ కార్యక్రమాలు నిర్వహించాలనే ఆలోచన చేస్తున్నారు.

త్వరలో యాత్ర తేదీ ప్రకటిస్తాం : అచ్చెన్నాయుడు

లోకేష్ యువగళం పాదయాత్రను కొన్ని రోజులు వాయిదా వేసుకోవాలని ముఖ్యనేతల సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు వెల్లడించారు. పున:ప్రారంభ తేదీని త్వరలో ప్రకటిస్తామని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాదయాత్ర పున:ప్రారంభ తేదీని వాయిదా వేసుకోవాలని లోకేష్‌ను ముఖ్యనేతలు కోరారని వివరించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఒక్క ఆధారం చూపలేని ప్రభుత్వం ఇన్నర్ రింగ్‌రోడ్డు, ఫైబర్ గ్రిడ్ అక్రమాలంటూ అసత్య ఆరోపణలతో బురద జల్లుతుందన్నారు. వీటన్నిటినీ న్యాయపరంగా ఎదుర్కోవాల్సిన నేపథ్యంలో పాదయాత్ర వాయిదా వేశామన్నారు.

రింగ్‌రోడ్డు ఎక్కడుందో చూపించగలరా? : టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి

అమరావతిలో ఇన్నర్ రింగ్‌రోడ్డు ఎక్కడుందో ప్రజలకు చూపించాలని మాజీ మంత్రి పేర్ని నానికి టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ సవాల్ విసిరారు. ఒక్క ఎకరం సేకరించకుండా, నిర్మాణమే మొదలుకాని రోడ్డు ఫలానా నాయకులు, ఫలానా సంస్థల పక్కగా వెళ్లిందని నాని పిచ్చివాగుడు వాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో లేవంటున్న స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను తాము ప్రత్యక్షంగా చూపిస్తామన్నారు. కాగ్ తాజా నివేదికలు వైసిపి ప్రభుత్వ అసమర్థ పాలనను, జగన్ దుర్మార్గాలను ఎత్తిచూపాయని టిడిపి ఎమ్మెల్సీ పి అశోక్ బాబు విమర్శించారు. కాగ్ నివేదికలపై అసెంబ్లీలో సమాధానం కూడా చెప్పకుండా సర్కార్ తప్పించుకోవడం జగన్ భయానికి నిదర్శనమని పేర్కొన్నారు. జిపిఎస్ అమలుకు సంబంధించిన బిల్లును అసెంబ్లీలో ప్రభుత్వం ఆమోదించడం దుర్మార్గమని మాజీ ఎమ్మెల్సీ ఎఎస్ రామకృష్ణ పేర్కొన్నారు. జిపిఎస్ బిల్లులో ప్రవర్తన అనే మాటకు అర్థం ఏమిటో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వం గిరిజనులకు ఏం చేసిందో చెప్పాలని టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు నాయక్ ప్రశ్నించారు. గిరిజనులకు జరుగుతున్న ద్రోహంపై మాట్లాడుతుండటంతో తనపై అక్రమ కేసులు పెట్టి, కక్షసాధింపులకు పాల్పడుతున్నారని అన్నారు.

ప్రభుత్వం స్పందించకుంటే సమ్మెకు సిద్ధం

- ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని ఎన్నికల ముందు, తరువాత ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి నిలుపుకోవాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు సిద్ధమవుతామని హెచ్చరించారు. అనంతపురంలోని పికె మెమోరియల్ హాలులో మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ ప్రాంతీయ సదస్సు గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజేషన్ చేస్తామని జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా అనంతపురం జిల్లాలోనే హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ తరువాత అసెంబ్లీలోనూ ఆయన ఇదే విషయాన్ని ప్రకటించారని తెలిపారు. ఇప్పటి వరకు ఆ హామీని నెరవేర్చే దిశగా చర్యలు తీసుకోవడంలేదని విమర్శించారు. ఆప్కాస్ విధానాన్ని తీసుకొచ్చి ఉద్యోగులుగా గుర్తిస్తామని చెప్పడమే మినహా ఒరిగిందేమీ లేదన్నారు. సమాన పనికి సమాన వేతనం, గ్రాట్యుటీ, ఎన్‌క్యాష్‌మెంట్ లీవ్, పింఛను తదితర సౌకర్యాలు కార్మికులకు లేవన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడంలేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

1న రాష్ట్ర కౌన్సిల్ సమావేశం

- బొప్పరాజు, చేబ్రోలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రెవెన్యూ ఉద్యోగుల 17వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం అక్టోబరు 1న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు ఎపి రెవెన్యూ అసోసియేషన్ (ఏపిఆర్ఎస్ఏ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, చేబ్రోలు కృష్ణమూర్తి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, సిసిఎల్ఎ సాయి ప్రసాద్, ఎన్‌టిఆర్, గుంటూరు జిల్లాల కలెక్టర్లు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ నెల 30న విజయవాడ గవర్నర్‌పేటలోని రెవెన్యూభవన్‌లో ఎపిఆర్ఎస్ఎ రాష్ట్ర కార్యవర్గానికి సంబంధించి ఎన్నికల ప్రక్రియ, అవసరమైతే ఎన్నికలు అదేరోజు సాయంత్రం ఐదు గంటలకు జరుగుతాయని తెలిపారు.

దయనీయంగా రంపచోడవరం ఏజెన్సీవాసుల బతుకులు

- సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లింపు దారుణం
- పోడు భూములకు పట్టాలివ్వాలి : వి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- రంపచోడవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా)

రంపచోడవరం ఏజెన్సీలో ఆదివాసీల బతుకులు దయనీయంగా మారాయని, సమస్యలు చుట్టుముట్టాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. సబ్‌ప్లాన్ నిధులను జగనన్న నవరత్నాలకు, సంక్షేమ పథకాల అమలుకు మళ్లించడం దారుణమని పేర్కొన్నారు. పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రంపచోడవరంలో గురువారం జరిగిన సిపిఎం ఎఎస్‌ఆర్ రంపచోడవరం జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ సర్కారు ఆదివాసీలపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని తెలిపారు. పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవానికి గిరిజన మహిళ అయిన రాష్ట్రపతిని ఆహ్వానించకపోవడం శోచనీయమన్నారు. గతంలో వామపక్షాల పోరాటంతో వచ్చిన అటవీ సంరక్షణ చట్టాన్ని నీరుగార్చిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీల హక్కులు, సంక్షేమం గురించి ఉపన్యాసాలు ఇస్తుందే తప్ప, గిరిజనుల కోసం ప్రత్యేకంగా చేసిందేమీ లేదని విమర్శించారు. ఇటువంటి ప్రభుత్వాలు ఆదివాసీల అభివృద్ధికి ఏం పనిచేస్తాయని ప్రశ్నించారు. పోడు భూములను సాగు చేసుకుంటున్న వారిని ప్రభుత్వాధికారులు ఆ భూముల నుంచి వెళ్లగొట్టడం దారుణమన్నారు. ఆదివాసీల భూములను లాక్కొని విద్యుదుత్పత్తి చేస్తామని, అభివృద్ధి బాట పట్టిస్తామని మోడీ, జగన్ ప్రభుత్వాలు మాయమాటలు చెప్పి మొత్తం అడవులను అదానీకి కట్టబెడుతున్నాయని విమర్శించారు. అడవుల మీద, పోడు భూముల మీద పూర్తి హక్కు ఆదివాసీలకే ఉంటుందని గుర్తు చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే ధనలక్ష్మి నియోజకవర్గ అభివృద్ధిలో విఫలమయ్యారని విమర్శించారు. రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలూ ఏర్పాటు చేసి గిరిజనులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. గత బడ్జెట్ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన జిపిఎస్ బిల్లును పిడిఎఫ్ ఎమ్మెల్సీలు తీవ్రంగా ప్రతిఘటించినా వైసిపి ప్రభుత్వం దాన్ని ఆమోదించడం దారుణమన్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఒపిఎస్‌ను అమలు చేస్తే తమకు అప్పు కూడా పుట్టదని చెప్పారని, అప్పుల కోసం ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేయడం భావ్యమా? అని ప్రశ్నించారు. ఒకసారి ఎమ్మెల్యేగా చేసిన వారు రూ.25 వేలు, రెండుసార్లు చేసిన వారు రూ.50 వేలు పెన్షన్ తీసుకుంటున్నారని, వారు ఆ పెన్షన్లను త్యాగం చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులను ఆదుకోవచ్చుకదా? అని అన్నారు. ఒపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, కార్యదర్శివర్గ సభ్యులు ఎం.వాణిశ్రీ, పి.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలపై అణచివేత ధోరణి తగదు

- కాకినాడ డిఎస్‌పిపై చర్యలు తీసుకోవాలి
- పోలీసుల తీరుపై న్యాయ పోరాటానికి సిద్ధం : వామపక్ష నేతలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రజల సమస్యల పరిష్కారం కోసం వామపక్షాలు, ప్రజా సంఘాలు చేస్తోన్న ఉద్యమాలపై అణచివేత ధోరణి తగదని వామపక్షాల నాయకులు అన్నారు. ఉద్యమాల పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్న కాకినాడ డిఎస్‌పిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాకినాడలోని సుందరయ్య భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా బుధవారం జరిగిన ధర్నాకు పోలీసుల అనుమతి తీసుకున్నామని తెలిపారు. ఉద్దేశపూర్వకంగానే డిఎస్‌పి మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు, రోప్‌లు, బారికేడ్లను అడ్డం పెట్టి రెచ్చగొట్టే ప్రయత్నం చేశారన్నారు. మహిళల పట్ల అనుచితంగా వ్యవహరించారని తెలిపారు. ఉద్యమాల పట్ల పోలీసుల తీరు సరిగాలేదన్నారు. సిపిఐ నాయకులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తుంటే పోలీసులు తన పట్ల అనుచితంగా వ్యవహరించారని తెలిపారు. డిఎస్‌పి తనపై ప్రదర్శించిన తీరు అత్యంత దారుణంగా, దుర్మార్గంగా ఉందన్నారు. ఇటువంటి నిర్బంధాలను ఏనాడు చూడలేదని తెలిపారు. సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యవర్గ సభ్యులు జె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకొచ్చిన తర్వాత ప్రజా సమస్యలపై ప్రశ్నించిన వారిని అక్రమంగా అరెస్టులు చేయిస్తుందన్నారు. పోలీసులను ప్రయోగించి దాడులు చేయించడం సరికాదన్నారు. పౌర సంక్షేమ సంఘం కన్వీనర్, సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోందని విమర్శించారు. కాకినాడలో ఎమ్మెల్యే ద్వారంపూడి అండదండలు చూసుకుని పోలీసులు రెచ్చిపోతున్నారని విమర్శించారు. తక్షణమే డిఎస్‌పిని ఇక్కడ నుంచి బదిలీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, న్యూడెమోక్రసీ నాయకులు వి.చిట్టిబాబు, సిపిఎం జిల్లా నాయకులు దువ్వా శేష బాబ్జి, పి.వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలపై ఏనుగుల దాడి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం (పార్వతీపురం మన్యం జిల్లా)

పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం రామినాయుడువలసలో ఏనుగులు బీభత్సం సృష్టించాయి. గ్రామానికి సమీపంలో ఉన్న శ్రీ సత్యసాయి ప్రాథమికోన్నత పాఠశాలలోని కిటికీలు, రేకులు, బెంచీలతో పాటు పాఠశాల ఆవరణలో ఉన్న సరస్వతీదేవి విగ్రహాన్ని ధ్వంసం చేశాయి. రామినాయుడువలస సమీపంలో ఉన్న చెరువులో ఏనుగులు తిష్టవేసి ఉన్నాయని, తమ పిల్లలను పాఠశాలకు పంపేందుకు భయపడుతున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు అటవీశాఖ అధికారులకు తెలిపారు. ఈ ప్రాంతం నుంచి ఏనుగులను తరలించే చర్యలు తీసుకోకపోవడంతో పాఠశాలపై దాడి చేశాయని గ్రామస్తులు ఆక్షేపిస్తున్నారు. రెండేళ్ల కిందట ఇదే మండలంలోని పెదబుడ్డిడిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంపై దాడి చేసి తలుపులు, కిటికీలు విరగొట్టాయి. నిత్యవసర సరుకులు ధ్వంసం చేశాయి. ఈ ప్రాంతం నుంచి ఏనుగులను తరలించి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం, అటవీ శాఖ అధికారులు విఫలమయ్యారని గిరిజన సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజ్ పట్ల జెఎసి హర్షం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

2014 జూన్ 2కు ముందు రిక్రూట్‌మెంట్ అయి ఇప్పటికీ పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో బిల్లును ఆమోదించినందుకు ఎపి స్టేట్ గవర్నమెంటు కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్, టీచర్స్ అండ్ వర్కర్స్ జెఎసి ఛైర్మన్ ఎవి నాగేశ్వరరావు, సెక్రటరీ జనరల్ ఎం బాలకాశి, కో ఛైర్మన్ విజయ్‌కుమార్ రాజు, కోశాధికారి దయామణి, కాంతారావు, నూర్ మహ్మద్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ హామీ ప్రకారం మిగిలిన ఉద్యోగులనూ రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖలు, విద్యుత్, ఆర్‌టిసి, టూరిజం, హౌసింగ్ వంటి 26 ప్రభుత్వ రంగ సంస్థలు, మున్సిపల్, పంచాయతీ తదితర స్థానిక సంస్థల్లో మూడు లక్షలకు పైగా ఉద్యోగుల కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిన అనేక ఏళ్లుగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

తిరుపతిలో విమానాల మరమ్మతు కేంద్రం!

- కెనడా ఏవియేషన్ కంపెనీతో ఒప్పందం
- రూ.600 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు
- 3 వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి!

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల మరమ్మతు, నిర్వహణ కేంద్రం ఏర్పాటు కానున్నాయి. రూ.600 కోట్లతో మెయింటినెన్స్ అండ్ రిపేరింగ్ ఆపరేషన్ (ఎంఆర్ఒ) సెంటర్ ఏర్పాటుకు కెనడాకు చెందిన ప్రయివేట్ ఏవియేషన్ కంపెనీ ముందుకొచ్చింది. ఇది కార్యరూపం దాల్చితే ప్రత్యక్షంగా, పరోక్షంగా మూడు వేల మందికి ఉపాధి లభించనుందని చెప్తున్నారు. తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల మరమ్మతు, నిర్వహణ కోసం ఎంఆర్ఒ సెంటర్ ఏర్పాటుకు గతంలో కేంద్ర విమానయాన శాఖ మంత్రితో పలుమార్లు సంప్రదింపులు జరిగాయి. హైదరాబాద్‌లో జరిగిన ఇన్వెస్ట్ ఇండియా శిఖరాగ్ర సమావేశం వేదికగా ఇందుకోసం ఔత్సాహిక కంపెనీల నుంచి గతంలో టెండర్లను ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో ఎంఆర్ఒ సెంటర్ ఏర్పాటుకు ముందుకొచ్చిన కెనడా ఏవియేషన్ కంపెనీ ప్రతినిధులు తిరుపతి విమానాశ్రయాన్ని గురువారం సందర్శించారు. ఇక్కడ ఎంఆర్ఒ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం విమానాశ్రయం సమీపంలోని ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌ను సందర్శించారు. ఆ తర్వాత తిరుపతి ఎంపి ఎం.గురుమూర్తితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ పెద్ద నగరాలకు దీటుగా తిరుపతి నగరాన్ని, తిరుపతి జిల్లాను అభివృద్ధిపథంలో నడిపేందుకు రూపొందించబడిన ప్రణాళికలో భాగంగా తిరుపతి విమానాశ్రయంలో ఎంఆర్ఒ సెంటర్ ఏర్పాటుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. కెనడా ఏవియేషన్ కంపెనీ వారు వారి ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నారని, రానున్న ఆరు నెలల్లో ఇది కార్యరూపం దాల్చనుందని చెప్పారు.

ఈ ప్రాజెక్టు వల్ల స్థానికంగా ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు.

విమానాశ్రయంలో తాత్కాలిక మరమ్మతులు

తిరుపతి విమానాశ్రయం నుంచి ప్రతి రోజూ 12 విమానాలు 36 ట్రిప్పుల్లో ప్రయాణికులను చేరవేస్తున్నాయి. వీటికి ఏ చిన్న మరమ్మతులు వచ్చినా చెన్నయ్, బెంగళూరు విమానాశ్రయాల నుంచి ఇంజనీర్లను పిలిపించుకోవాల్సి వస్తోంది. ఈ పదేళ్లలో 17 విమానాలు మరమ్మతుకు గురై ఆగిపోయిన సందర్భాలు ఉన్నాయి. కెనడా ఏవియేషన్ కంపెనీ వారు ఎంఆర్ఒ సెంటర్ ఏర్పాటు చేస్తే ఇటువంటి మరమ్మతులను స్థానికంగానే చేసుకునే వీలుంటుందని చెప్తున్నారు.

బాలికపై అత్యాచారం...

- మధ్యప్రదేశ్‌లో ఘాతుకం

ఉజ్జైన్ : మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని నగరంలో ఓ టీనేజ్ అమ్మాయి అత్యాచారానికి గురైంది. ఆ బాలికను తీవ్రంగా హింసించారని ఉజ్జయినికి చెందిన రాహుల్ శర్మ అనే ఓ పూజారి తెలిపారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధిచి రాహుల్ శర్మ తెలిపిన వివరాల ప్రకారం.. 'ఉజ్జయిని నగరానికి 15 కిలోమీటర్ల దూరంలో బద్ నగర్ రోడ్డులోని ఆశ్రమం నుంచి ఉదయం 9.30 గంటల సమయంలో ఆశ్రమం గేట్ వద్ద రక్తస్రావంతో అర్ధనగ్నంగా ఉన్న బాలికను చూశాను. విపరీతంగా రక్తస్రావమవుతున్న ఆమెకు నా బట్టలు ఇచ్చాను. ఆమె మాట్లాడలేకపోతుంది. కళ్లు వాచిపోయాయి వున్నాయి. 100కి కాల్ చేసినా పోలీసులు రాకపోవడంతో... స్వయంగా మహకాల్ పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి.. ఆశ్రమం గేట్ వద్ద పడివున్న బాలిక పరిస్థితి గురించి పోలీసులకు ఫిర్యాదు చేశాను. అనంతరం 20 నిమిషాల్లో పోలీసులు ఆశ్రమానికి చేరుకున్నారు' అని రాహుల్ చెప్పారు. అత్యాచారానికి గురై... అర్ధనగ్నంగా వున్న ఆ బాలిక... స్థానికంగా ఇంటి ఇంటికి వెళ్లి సహాయం అర్థించినా... ఎవరూ సహాయం చేయలేదు. ఆ అమ్మాయి ఓ వ్యక్తిని సహాయం చేయమని దగ్గరకు వెళ్తుండగా.. అతను ఆమెను దూరంగా తరమికొట్టిన దృశ్యం సిసిటివి ఫుటేజ్‌లో కనిపించినట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఈ ఘటన తర్వాత ఆ అమ్మాయి దగ్గరకు పోలీసులు వచ్చినా భయపడి తన వెనుకే దాక్కుందని రాహుల్ శర్మ చెప్పారు. పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబి వేడుకలు

- పరమత సహనంతో జీవించాలి : కలెక్టర్ సృజన

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

మిలాద్ ఉన్ నబి వేడుకల్లో భాగంగా కర్నూలులో లావుబాలి దర్గా నుంచి రాజ్‌విహార్ సెంటర్ వరకూ ముస్లిములు భారీ ర్యాలీ నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ సృజన, ఎస్‌పి కృష్ణకాంత్, కర్నూలు ఎంపి డాక్టర్ సంజీవ్ కుమార్, మాజీ ఎంపి బుట్టా రేణుక, స్థానిక ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి మోహన్ రెడ్డి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ.. దేశంలో శాంతిని నెలకొల్పాలని మహమ్మద్ ప్రవక్త ఆనాడే సూచించారని తెలిపారు. నగర ప్రజలు శాంతి, సౌభ్రాతృత్వం కలిగి ఉండాలని, ప్రేమ ఆప్యాయతలను పంచుతూ పరమత సహనం కలిగి కలిసి మెలిసి జీవించాలని అన్నారు. సెంట్రల్ మిలాద్ కమిటీ నాయకులు సయ్యద్ షఫీ పాషా ఖాద్రీ మాట్లాడుతూ.. అహలే సున్నత్ వారి కోసం ఈద్గా కావాలని కలెక్టర్‌ను కోరారు. ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ మాట్లాడుతూ.. వక్ఫ్‌బోర్డుకు చెందిన 40 ఎకరాల్లో నాలుగు ఎకరాలు ఈద్గాకు ఇచ్చేందుకు ఎస్‌పి, కలెక్టర్ సహకారం అందించాలని కోరారు. పేదల కోసం నగరంలో రూ. కోటితో షీనరల్ హోం తయారు చేస్తున్నట్లు తెలిపారు. సెంట్రల్ మిలాద్ కమిటీ సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా అజ్మీర్ వెళ్లేందుకు లక్కీడిప్ ద్వారా ఐదుగురిని మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి మోహన్‌రెడ్డి ఎంపిక చేశారు.

అనంతరం దర్గా వద్ద జెండా ఆవిష్కరణ, ప్రార్థన చేసి సలాంతో కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో కెడిసిసి చైర్మన్ ఎస్‌వి. విజయమనోహరి, ఉస్మానియా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సమీరుద్దీన్ ముజమ్మిల్, సయ్యద్ షా అబ్దుల్లా ఖాద్రీ, వివిధ దర్గాల పీఠాధిపతులు, ముస్లిం పెద్దలు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.పలు జిల్లాల్లో వేడుకలు నిర్వహించారు.



మిలాద్ ఉన్ నబి వేడుకల్లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత పోరాడాలి



కర్నూలులో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

- రాష్ట్ర వ్యాప్తంగా జయంతి వేడుకలు
- దోపిడీ లేని సమాజం కోసం ఉద్యమించాలి : రామన్న

ప్రజాశక్తి - యంత్రాంగం

భగత్ సింగ్ స్ఫూర్తితో విద్య, ఉపాధి అవకాశాల కోసం యువత పోరాడాలని పలువురు నాయకులు కోరారు. భగత్ సింగ్ 116వ జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. విజయవాడలో మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో, 60వ డివిజన్ వాంబేకాలనీలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ.. చిన్న వయస్సులోనే దేశం పట్ల, ప్రజల పట్ల అత్యంత భక్తి కలిగిన వీరుడు భగత్ సింగ్ అని కొనియాడారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదులను గడగడలాడించి స్వేచ్ఛ కోసం, సమానత్వం కోసం, దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేశారని తెలిపారు. అసమానతలు తొలగిపోవాలంటే సోషలిజమే మార్గమని నమ్మి, అందుకోసం యువత పోరాడాలని ఆరోజే కోరారని గుర్తు చేశారు. ఈరోజు దేశాన్ని పట్టి పీడుస్తున్నా నిరుద్యోగం, ధరలు, పేదరికం, నిరక్షరాస్యత, ఆకలి చావులు, రైతు ఆత్మహత్యలు, మహిళలపై అఘాయిత్యాలు, దళితులపై దాడులు అంతరించినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం అని, అదే భగత్ సింగ్‌కు మనం అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. అవినీతి రహిత, అసమానతలు, దోపిడీ లేని సమాజం కోసం ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో రక్తదాన శిబిరం నిర్వహించారు. డాక్టర్ పామరాజు వెంకటేశ్వర్లు, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు ఎ.లక్ష్మీశ్వరరెడ్డి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, మంగళగిరిలో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. విశాఖ జిల్లా అక్కయ్యపాలెం ఎఎస్ఆర్.నగర్‌లో మొక్కలు నాటారు. ఉమ్మడి అనంతపురం, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కర్నూలులో కొత్త బస్టాండ్ నుంచి సుందరయ్య జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. బాపట్లలో ఫోరం ఫర్ బెటర్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.



ఏషియన్ పెయింట్స్ అశ్విన్ కన్నుమూత

ముంబయి : ఏషియన్ పెయింట్స్ లిమిటెడ్ సహ వ్యవస్థాపకులు, నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, అశ్విన్ డాని కన్నుమూశారు. కంపెనీ నలుగురు సహ వ్యవస్థాపకుల్లో ఆయన ఒక్కరు. డాని మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నప్పుడు కంపెనీని నూతన శిఖరాలకు తీసుకెళ్లారు. 79 ఏళ్ల అశ్విన్ డాని మరణించడంతో గురువారం ఆ కంపెనీ షేర్లు 4 శాతం మేర నష్టపోయాయి.

సంపాదకీయం


ఏకపక్షం

ప్రజా సమస్యలకు పట్టం కట్టి, వాటి పరిష్కారానికి దిశా నిర్దేశం చేయాల్సిన అసెంబ్లీ సమావేశాలు ఏకపక్ష విన్యాసాలుగా మారడం దురదృష్టకరం. ఐదు రోజుల పాటు జరిగిన సమావేశాల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తి శూన్యం. ఫలప్రదంగా చర్చలు జరిగాయని ప్రభుత్వం చెప్పుకోవడం సముచితమనిపించుకోదు. మొదటి రెండు రోజులు అసెంబ్లీకి హాజరైన ప్రధాన ప్రతిపక్షం, ఆ తరువాత సమావేశాలను బహిష్కరించింది. మండలిలో పిడిఎఫ్ సభ్యులు లేవనెత్తిన వివిధ అంశాలకు అధికారపక్షం నుండి దాటవేతే సమాధానంగా వచ్చింది. ఇక ప్రతిపక్షమే లేకుండా జరిగిన శాసనసభలో చర్చలు ఏ రీతిగా జరిగి ఉంటాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అత్యంత కీలకమైన జిపిఎస్ బిల్లుపై రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరే దీనికి నిలువెత్తు నిదర్శనం. ఈ బిల్లును శాసనసభలో ఏకపక్షంగా ఆమోదించుకున్న ప్రభుత్వం మండలిలో పిడిఎఫ్ సభ్యులు లేవనెత్తిన అభ్యంతరాలను పట్టించుకోలేదు. నిరసన చెబుతుండగానే బిల్లును ఓటింగ్‌కు పెట్టి, మూజువాణి ఓటుతో ఆమోదించారు. ఓటింగ్‌కు పెట్టే సమయంలో సభ్యులందరూ తమ సీట్లలో ఉండేలా చూసుకోవాలన్న ప్రాథమిక సూత్రాన్ని కూడా పాటించలేదు. దీంతో పిడిఎఫ్ సభ్యులకు వాకౌట్ చేయడం మినహా మరో మార్గం కనిపించలేదు. నిజానికి ఈ బిల్లుకు వ్యతిరేకంగా, పాత పెన్షన్ విధానం (ఒపిఎస్) కావాలని రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళన చేస్తూనే ఉన్నారు. అయినా, చట్టసభల్లో విస్తృతమైన చర్చకు ప్రభుత్వం సిద్ధపడకపోవడం దారుణం.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ స్కామ్‌లో అవినీతి ఆరోపణలపై మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేసిన నేపథ్యంలో జరిగిన తాజా అసెంబ్లీ సమావేశాలకు సహజంగానే ప్రాధాన్యత ఉంది. ఈ వ్యవహారంపై ప్రతిపక్ష సభ్యులు ఏం ప్రశ్నిస్తారు? అధికారపక్షం ఏం జవాబు చెబుతుందన్న ఉత్కంఠ రాష్ట్ర వ్యాప్తంగానే ఉంది. దీంతో పాటు ఎన్నికల వేడి ఇప్పటికే రాజుకోవడంతో వివిధ ప్రజాసమస్యలపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందన్న అంశం కూడా ఆసక్తికరంగా మారింది. అయితే, జరిగింది భిన్నం. మొదటి రెండు రోజులు అధికార వైసిపి, ప్రధాన ప్రతిపక్షమైన టిడిపి సభ్యుల మధ్య వాదోపవాదాలకే సరిపోగా, ఆ తరువాత ఏకపక్షానికే సభ పరిమితమైంది. తప్పనిసరి పరిస్థితుల్లో, చిట్టచివరి ప్రయత్నంగా మాత్రమే ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేయాల్సి ఉండగా, జరిగింది దానికి భిన్నం. సాంకేతికంగా సభలో చేసిన ఒకటి, రెండు విజ్ఞప్తులు మినహా ప్రతిష్టంభనను తొలగించడానికి అవసరమైన చొరవను అధికారపక్షం చూపలేదు. ఈ సందర్భంగా స్పీకర్ అనుసరించిన వైఖరి కూడా చర్చనీయాంశంగా మారింది. మరోవైపు చంద్రబాబు అరెస్ట్ మినహా రాష్ట్రంలో మరే సమస్య లేనట్లు తెలుగుదేశం పార్టీ వ్యవహరించింది. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడానికి బదులు సమావేశాలను బహిష్కరించే మార్గం ఎంచుకుంది. ఈ చర్య అధికార పార్టీ మరింత నిరంకుశంగా వ్యవహరించడానికి ఉపయోగపడింది.


శాసనసభ సమావేశాల్లో వైసిపి, టిడిపిలు అనుసరించిన ఈ వైఖరితో కీలకమైన ప్రజా సమస్యలు మరుగున పడ్డాయి. జిపిఎస్ బిల్లును ఆమోదించిన విధంగానే అసైన్డ్ భూముల చట్ట సవరణకూ, కాంట్రాక్టు ఉద్యోగులందరికీ వర్తించాల్సిన క్రమబద్ధీకరణ ప్రయోజనాలను కొద్దిమందికే పరిమితం చేసేలా రూపొందించిన బిల్లునూ, ఈ సమావేశాల్లోనే ప్రభుత్వం ఆమోదింపచేసుకుంది. కేంద్రంలో బిజెపి ఒత్తిడికి తలొగ్గి పాఠశాల విద్యలో మూడవ భాషగా సంస్కృతాన్ని ప్రవేశపెడుతున్నట్లు ఏకపక్ష ప్రకటన చేసింది. పోలవరం ముంపు బాధితుల పునరావాసంతో పాటు, అంగన్‌వాడీలు, మున్సిపల్ వర్కర్లు, విద్యుత్ ఉద్యోగులు వంటి వివిధ తరగతుల ప్రజానీకానికి సంబంధించిన అంశాలను అసలు సమస్యలే కావన్నట్లు అధికారపక్షం వ్యవహరించింది. కొద్దిమందే ఉన్నా పిడిఎఫ్ సభ్యులు వీటిని లేవనెత్తడానికి మండలిలో పదేపదే చేసిన ప్రయత్నాల ఫలితంగా అరకొరగానైనా ప్రభుత్వం వీటిపై స్పందించాల్సి వచ్చింది. మొత్తంమీద ఈ అయిదు రోజుల అసెంబ్లీ సమావేశాలు నిస్సారంగా ముగిశాయనే చెప్పాలి. దీనికి ప్రధాన బాధ్యత అధికార పార్టీదే.

మహనీయుల మాట



ప్రజలు భిన్న మతాలు, భాషలు, వస్త్రధారణలు, సంప్రదాయాలు కలిగి ఉన్నప్పటికీ మనందరిదీ ఒకే దేశం. మన స్వాతంత్ర్య పోరాట చరిత్ర, భవిష్యత్ అభివృద్ధి పట్ల మన విశ్వాసం మనల్ని ఒక్కటిగా కట్టిపడేసే అంశాలు.

- లాల్ బహదూర్ శాస్త్రి,
భారత పూర్వ ప్రధాని.



పార్లమెంట్‌లో విద్వేష ప్రసంగం!

వ్యాఖ్య

సమాజంలో ఈనాడు విశృంఖలంగా కనిపిస్తున్న ముస్లింలపై విద్వేష ప్రసంగాలనేవి ఇప్పుడు పార్లమెంట్‌ను కూడా ముట్టడించాయి. కొత్త పార్లమెంట్ భవనంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశాల చివరి రోజున, ఢిల్లీకి చెందిన బిజెపి పార్లమెంట్ సభ్యుడు రమేష్ బిదూరి, బిఎస్‌పి ఎం.పి డానిష్ అలీపై అత్యంత దారుణమైన, అసభ్యకరమైన ముస్లిం వ్యతిరేక పదాలను ఉపయోగించారు. 'ముల్లా టెర్రరిస్ట్' అంటూ వాడిన పదాలను గతంలో ఎన్నడూ పార్లమెంట్‌లో విని వుండలేదు. కానీ డానిష్ అలీని ఉద్దేశించి బిదూరీ పదే పదే ఆ పదాలను ఉపయోగించారు. బిదూరీ మాట్లాడిన వీడియోను దేశవ్యాప్తంగా పదులు, వేల సంఖ్యలో ప్రజలు చూశారు. తీవ్రమైన ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. వెంటనే సదరు సభ్యుడు బిదూరీపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, పాలక పార్టీ నాయకత్వం కఠినమైన చర్యలు తీసుకుంటుందని ఎవరైనా ఆశిస్తారు. కానీ అటువంటిదేమీ జరగలేదు. ప్రతిపక్షాల మనోభావాలు దెబ్బతిన్నట్లైతే తాము విచారిస్తున్నామని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. అంతకు మించి, ముస్లిం వ్యతిరేక దూషణలను ఖండించడం గానీ లేదా డానిష్ అలీకి క్షమాపణలు చెప్పడం గానీ జరగలేదు.

బిదూరీని సభ నుండి సస్పెండ్ చేస్తూ తక్షణ చర్యలు తీసుకోవాల్సిన స్పీకర్, కేవలం బిదూరీకి గట్టిగా హెచ్చరిక చేయడంతోనే ఆగిపోయారు. ఇకపై సభలో ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే సహించేది లేదని మాత్రం హెచ్చరించి వదిలేశారు.

ప్రతిపక్ష సభ్యులు పదే పదే తాము లేవదీయాలనుకున్న అంశాలను లేవనెత్తడానికి ప్రయత్నించినా లేదా ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి ప్రయత్నించినా లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రిసైడింగ్ అధికారులు వారి పట్ల వ్యవహరించే తీరుకు పూర్తి విరుద్ధంగా పై సంఘటన వుంది. రాజ్యసభలో, 'ఆప్' ఎం.పి సంజయ్ సింగ్‌ను వర్షాకాల సమావేశాలకు మొత్తంగా సస్పెండ్ చేశారు. పైగా ఆయనపై గల ఫిర్యాదును సభా హక్కుల కమిటీ పరిష్కరించేవరకు ఆ సస్పెన్షన్‌ను కొనసాగించారు. 'ఆప్' మరో ఎం.పి రాఘవ్ చద్దా కూడా గత





PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

సమావేశాల్లో సస్పెండ్ అయ్యారు. లోక్‌సభలో 'ఆప్' సభ్యుడు సుషైల్ కుమార్ రాధి మిగిలిన వర్షాకాల సమావేశాలకు సస్పెండ్ కాగా, సభా హక్కుల కమిటీ సమావేశమై, తిరిగి తీసుకోవాల్సిందిగా సిఫార్సు చేసేవరకు లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ నేత అధిర్ రంజన్ చౌదరి సస్పెండయ్యారు. బిదూరీపై చర్య తీసుకోవాలని కోరుతూ డానిష్ అలీ రాసిన లేఖపై స్పీకర్ ప్రతిస్పందించలేదు. బిజెపి, బిదూరీకి షోకాజ్ నోటీసు జారీ చేసింది కానీ ఇంతవరకు ఎలాంటి చర్య తీసుకోలేదు.

బిదూరీపై చర్య తీసుకోవడానికి బదులుగా, ఆయనకు అండగా నిలబడే విషయమై బిజెపి ఆందోళన చెందుతోంది. ప్రధానికి వ్యతిరేకంగా అప్రజాస్వామ్య వ్యాఖ్యలు చేయడం ద్వారా అలీ, బిదూరీని రెచ్చగొట్టారంటూ నిషికాంత్ దూబే వంటి బిజెపి ఎంపీలు స్పీకర్‌కు లేఖలు రాశారు.

దేశవ్యాప్తంగా కాషాయ మూకలు ముస్లిం వ్యతిరేక ప్రసంగాలు చేయడం, ముస్లింలపై దాడులకు పాల్పడుతున్న నేపథ్యంలోనే బిదూరీ విద్వేష ప్రసంగాలను కూడా చూడాల్సి వుంది. ముస్లిమ్‌లను సమూలంగా నిర్మూలించాంటూ ధర్మ సంసద్‌లు పిలుపివ్వడం, గోవులను అక్రమంగా రవాణా చేస్తున్నారని లేదా గొడ్డు మాంసాన్ని తీసుకెళుతున్నారనే అనుమానాలతో ముస్లింలను వేధించి, కొట్టి చంపడమనేది హర్యానా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వంటి బిజెపి పాలిత రాష్ట్రాల్లో నిత్యం జరుగుతున్నాయి. రైల్వే రక్షక దళం (ఆర్.పి.ఎఫ్)కి చెందిన కానిస్టేబుల్ కదులుతున్న రైల్లో ముగ్గురు ముస్లింలను కాల్చి చంపడం, ముస్లిం విద్యార్థిని సహచర విద్యార్థులు వరుసగా చెంపపై కొట్టాలంటూ ముజఫర్ నగర్‌లో ఒక స్కూలు టీచర్ ఆదేశించడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్న తరహా లోనే బిదూరీ సంఘటనను మనం చూడాల్సి వుంది. హిందువులు నివసించే

దేశవ్యాప్తంగా కాషాయ మూకలు ముస్లిం వ్యతిరేక ప్రసంగాలు చేయడం, ముస్లింలపై దాడులకు పాల్పడుతున్న నేపథ్యంలోనే బిదూరీ విద్వేష ప్రసంగాలను కూడా చూడాల్సి వుంది. ముస్లిమ్‌లను సమూలంగా నిర్మూలించాంటూ ధర్మ సంసద్‌లు పిలుపివ్వడం, గోవులను అక్రమంగా రవాణా చేస్తున్నారని లేదా గొడ్డు మాంసాన్ని తీసుకెళుతున్నారనే అనుమానాలతో ముస్లింలను వేధించి, కొట్టి చంపడమనేది హర్యానా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వంటి బిజెపి పాలిత రాష్ట్రాల్లో నిత్యం జరుగుతున్నాయి. రైల్వే రక్షక దళం (ఆర్.పి.ఎఫ్)కి చెందిన కానిస్టేబుల్ కదులుతున్న రైల్లో ముగ్గురు ముస్లింలను కాల్చి చంపడం, ముస్లిం విద్యార్థిని సహచర విద్యార్థులు వరుసగా చెంపపై కొట్టాలంటూ ముజఫర్ నగర్‌లో ఒక స్కూలు టీచర్ ఆదేశించడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్న తరహా లోనే బిదూరీ సంఘటనను మనం చూడాల్సి వుంది.

ప్రాంతాల్లో ముస్లిం చిరు వ్యాపారులు తమ వ్యాపారాలను చేసుకోనివ్వకుండా అడ్డుకోవడం, ఆర్థికంగా వారిని బహిష్కరించాలంటూ బెదిరింపుల నేపథ్యంలోనే ఇవన్నీ జరుగుతున్నాయి.

బిదూరీపై పార్లమెంట్‌లో కఠిన చర్య తీసుకోవడంలో విఫలమవడంతో పార్లమెంట్ ప్రతిష్టను కించబరిచినట్లైంది. పాలక పార్టీ పెంచి పోషిస్తున్న ఇస్లామోఫోబియాకు చట్టబద్ధమైన ముద్ర వేసేలా వుంది. బిదూరీ విద్వేష ప్రసంగమనేది మొత్తంగా బిజెపి వైఖరి లేదా దృక్పథంలో భాగమేనన్నది ఈ సంఘటన రుజువు చేస్తోంది. రాజదండాన్ని ప్రతిష్ఠించిన కొత్త పార్లమెంట్ భవనంలో దీన్ని "హిందూత్వ శక్తి'గా బిజెపి పార్లమెంట్ సభ్యులు భాష్యం చెబుతున్నారు. దానికి అనుగుణంగానే వ్యవహరిస్తున్నారు.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

సమస్య



మరోసారి చమురు ధరల పెరుగుదల!

ప్రపంచ మార్కెట్లో మరోసారి ముడి చమురు ధరలు పెరుగుతున్నాయి. విపణి పండితుల జోస్యాలను వమ్ము చేస్తున్నాయి. సౌదీ అరేబియా, రష్యా, ఇతర చమురు ఎగుమతి దేశాలు (ఒపెక్) ఉత్పత్తిని తగ్గించగా అమెరికా పెంచినప్పటికీ జూన్ నెల నుంచి ఇప్పటి వరకు 30 శాతం పైగా ధరలు పెరగటం ఆందోళన కలిగిస్తోంది. గత ఏడాది ఒక పీపా ధర 110 డాలర్ల వరకు పెరిగింది. గురువారం నాటికి ప్రామాణిక బ్రెంట్ రకం ధర 97 డాలర్లు దాటింది. వంద డాలర్ల వద్ద స్థిరపడుతుందని వెలువడుతున్న అంచనాలు అభివృద్ధి చెందుతున్న దేశాలకు దుర్వార్తలే. ఇంతకు మించి ధరలు ఎంత కాలం ఉన్నప్పటికీ ఆర్థిక వ్యవస్థ ఖాయిలా తీవ్రంగా ఉంటుందని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. చమురు ధరల తగ్గుదల ఎగుమతి మీద ఆధారపడిన దేశాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్న కారణంగా అవి ఉత్పత్తిని తగ్గించి ధరలను పెంచుకోవాలని చూస్తున్నాయి. చమురు ధరలు ఆకస్మికంగా పెరగటానికి కారణాలు ఏమిటి? అమెరికా భవిష్యత్ అవసరాల కోసం భారీ ఎత్తున వ్యూహాత్మక చమురు నిల్వల విధానాన్ని అనుసరిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం అవి నాలుగు దశాబ్దాల కనిష్టానికి పడిపోయాయి. తిరిగి వాటిని నింపుతున్నప్పటికీ అవి 2021 నాటి స్థాయికి మాత్రమే చేరతాయనే అంచనాలు ధరలు పెరగటానికి ఒక కారణం. ఒపెక్ దేశాలు ఉత్పత్తిని తగ్గించటం మరొక కారణమైతే చైనాలో ఆర్థిక వృద్ధి మందగించిందంటూ ఎన్ని కథలు వినిపించినప్పటికీ అక్కడ తిరిగి గిరాకీ ఏర్పడనుందనే అంచనాలు కూడా దోహదం చేస్తున్నాయి.

ఈ ఏడాది సెప్టెంబరులో అమెరికాలో రోజుకు పదమూడు మిలియన్ల పీపాల చమురు ఉత్పత్తి జరిగి 2019 నవంబరు నాటి రికార్డును దాటుతుందని చెబుతున్నారు. వచ్చే ఏడాది సగటున నెల వారీ అదే మాదిరి కొనసాగవచ్చని చెబుతున్నప్పటికీ జెపి మోర్గాన్ సంస్థ విశ్లేషకులు చమురు ధర 2026 నాటికి 150 డాలర్లకు చేరవచ్చని చెప్పారు. వచ్చే ఏడాది 90 నుంచి 110 డాలర్ల మధ్య కదలాడవచ్చన్నారు. ఆ సంస్థ విశ్లేషణ వెలువడిన నాడు 93.55గా ఉన్న ధర వారం లోపే గురువారం నాడు 96-97 డాలర్ల మధ్య కదలాడింది. ఈ ఏడాది వంద డాలర్లకు మించక పోవచ్చని ఫిబ్రవరిలో చెప్పిన అంచనా ఏడు నెలల్లోనే తప్పి వంద డాలర్లు దాటే దిశలో పయనిస్తోంది. గిరాకీ-సరఫరా మధ్య లోటు 2025లో రోజుకు 1.1 మిలియన్ పీపాలుగా ఉన్నది 2030 నాటికి 7.1 మిలియన్ల పీపాలకు పెరగవచ్చని జె.పి మోర్గాన్ అంచనా. అందువలన చమురు ధరల్లో స్వల్ప ఎగుడుదిగుళ్లు తప్ప పెరిగేందుకే ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. గత ఏడాదిన్నర కాలంగా ధరలు తగ్గిన కారణంగా తమ లాభాలకు గండి పడుతుందనే ఉద్దేశ్యంతో కడుపు నిండిన అమెరికా చమురు సంస్థలు అసలు ఉత్పత్తినే తగ్గించి వేశాయి. ఇప్పుడు పెరుగుతుండటంతో రిగ్గుల దుమ్ము దులుపుతున్నాయి. రష్యా చమురు ఎగుమతుల నిషేధం కొనసాగుతుందనే ధైర్యం కూడా దీనికి దోహదం చేస్తున్నది.

మాంద్యం వంటి ప్రతికూలతలతో అసలే అంతంత మాత్రంగా ఉన్న వృద్ధి రేటు చమురు ధరలతో మరింత కుదేలు కావటం ఖాయం. ఆచరణలో అది సామాన్యుల మీద భరించలేని భారాన్ని మోపుతుంది. తినీతినక కాస్తోకూస్తో కూడబెట్టుకున్న సొమ్మంతా ధరల పెరుగుదలతో హరీ అంటున్నది. చమురు ధరలు పెరిగితే మన దేశంలోని 42 శాతం కుటుంబాలు ఆమేరకు ఇతర ఖర్చులు తగ్గించుకుంటాయని గతేడాది లోకల్ సర్కిల్స్ సర్వే వెల్లడించింది. ఇప్పటికే డాలరు విలువ పెరగటం, భారత్ వంటి దేశాల కరెన్సీల విలువలు పతనం కావటంతో చమురు కొనుగోలు భారం అవుతున్నది. అంతర్జాతీయ మార్కెట్లో ధరలతో నిమిత్తం లేకుండా పెట్రోలు, డీజిలు మీద భారీ ఎత్తున సెస్‌లను పెంచి గడచిన తొమ్మిది సంవత్సరాలలో దాదాపు 30 లక్షల కోట్ల రూపాయల మేరకు జనం మీద భారం మోపిన సంగతి తెలిసిందే. అదే మోడీ సర్కార్ 2017 నుంచి ఇప్పటి వరకు కనీస వేతనాలను సవరించలేదు. నగదు రూపంలో గతంతో పోల్చితే పొందుతున్న మొత్తం పెరిగినట్లు కనిపిస్తున్నప్పటికీ ద్రవ్యోల్బణంతో పోలిస్తే నిజ వేతనాలు తగ్గాయి, అంటే జనం జేబులకు చిల్లుపడింది. దీన్నే గోడ దెబ్బ చెంప దెబ్బ అంటారు. పెరుగుతున్న ఉప్పుపప్పుల ధరలతో పోల్చితే ఎన్నికల కోసం గ్యాస్ బండ మీద రెండు వందల రూపాయలు తగ్గించిన మాత్రాన జనానికి ఒరిగేదేమీ లేదు. పదేళ్ల క్రితం వున్న స్థితికి చమురు మీద పన్నులు తగ్గిస్తే జనానికి ఉపశమనం.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

సాగునీటి వనరుల పట్ల పాలకుల నిర్లక్ష్యం

విశ్లేషణ



వి. రాంభూపాల్

అన్నపూర్ణగా కీర్తించబడిన ఆంధ్రప్రదేశ్ నేడు 'అన్నమో రామచంద్రా...' అనే పరిస్థితికి చేరుతున్నది. వర్షాభావం వల్ల ఈ సంవత్సరం రాష్ట్రంలో సుమారు 31 లక్షల ఎకరాల్లో విత్తనం వేయలేదు. సాగునీటి ప్రాజెక్టులు నీటి కళ తప్పి వెలవెల పోతున్నాయి. రాష్ట్రంలోని అనేక ప్రాజెక్టుల కింద ఈ సంవత్సరం సాగు ప్రశ్నార్థకంగా మారింది. వరి లాంటి పంటలు కాకుండా ఆరుతడి పంటలు వేసుకొమ్మని నీటిపారుదల అధికారులు జిల్లాల్లో ప్రకటిస్తున్నారు. ఈ పరిస్థితులకు ప్రకృతి కారణమంటూ పాలకులు చేతులు దులుపుకుంటున్నారు. 'ఇన్నాళ్ళు వానదేవుడు మా వాడు అని చెప్పారు కదా....ఇప్పుడు ఏమయ్యాడ'ంటూ ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రజలు వారి జీవన పరిస్థితులు కాకుండా తక్షణం ఎన్నికల్లో గెలవడానికి ఏ విల్లంబులు ఎక్కుపెట్టాలో పాలక, ప్రతిపక్ష పార్టీలు సిద్ధం చేసుకుంటున్నాయి. అత్యధిక మందికి ఉపాధిని చూపే వ్యవసాయం, భవిష్యత్ తరాలకు భద్రతను ఇచ్చే పరిశ్రమల గురించి కాకుండా అవినీతి, జైళ్లు, బెయిళ్ల చుట్టూ రాష్ట్ర రాజకీయాలు తిరుగుతున్నాయి.

పునర్విభజన అనంతరం 13 జిల్లాలు 1,62,970 చ.కి.మీ భౌగోళిక విస్తీర్ణంతో 974 కిలోమీటర్ల పొడవుతో దేశంలోనే రెండవ అతి పెద్ద తీర రేఖ కలిగి దేశంలో 8వ అతి పెద్ద రాష్ట్రంగా మన రాష్ట్రం ఏర్పడింది. రాష్ట్రంలోని ప్రధాన నదులైన గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార, నాగావళి నదుల ద్వారా 1554 టిఎంసీల నీరు మన రాష్ట్రానికి లభ్యమవుతుంది. ఇవి కాకుండా వర్షాధార అదనపు జలాలు 776.715 టిఎంసీలు, భూగర్భ జలంగా మారే నీరు 355.000 టిఎంసీలు అందుబాటులో ఉన్నాయి. ఈ మొత్తం నీటిని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి వినియోగించే పద్ధతిలో సక్రమంగా పంపిణీ చేసి, ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టుల సామర్ధ్యాన్ని పెంచడానికి, అవసరమైన కొత్త ప్రాజెక్టులను నిర్మించడానికి ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వాలి. కాని గత పది సంవత్సరాల అనుభవం చూస్తే ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణ పట్ల పాలకులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

ప్రస్తుత సాగునీటి వనరులు-సాగు విస్తీర్ణం

మన రాష్ట్రంలో గోదావరి 784.000 టిఎంసీలు, కృష్ణా 609.000, పెన్నా 93.000, వంశధార 46.000, నాగావళి ద్వారా 22.000 టిఎంసీల నీరు ఈ 5 ప్రధాన నదుల నుండి మొత్తం 1554 టిఎంసీల నీరు మనకు అందుబాటులో ఉంది. ఈ నీటిలో ఉమ్మడి 13 జిల్లాల్లో కలిపి 1476.109 టిఎంసీల నీటిని నిలుపుకునే సామర్థ్యం కలిగిన ఏర్పాట్లు ఉన్నాయి. ఇంకో 78 టిఎంసీల నికర జలాలను నిల్వ చేసుకునేందుకు ఏర్పాట్లు చేసుకోవాలి. ఇవి కాకుండా వర్షాధార అదనపు జలాలు, భూగర్భ జలాలు ఉన్నాయి. 13 జిల్లాల్లో వినియోగించ వీలున్న వర్షపు జలాలు సుమారు 776.715



రాష్ట్రంలోని ప్రధాన నదులైన గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార, నాగావళి నదుల ద్వారా 1554 టిఎంసీల నీరు మన రాష్ట్రానికి లభ్యమవుతుంది. ఇవి కాకుండా వర్షాధార అదనపు జలాలు 776.715 టిఎంసీలు, భూగర్భ జలంగా మారే నీరు 355.000 టిఎంసీలు అందుబాటులో ఉన్నాయి. ఈ మొత్తం నీటిని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి వినియోగించే పద్ధతిలో సక్రమంగా పంపిణీ చేసి, ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టుల సామర్థ్యాన్ని పెంచడానికి, అవసరమైన కొత్త ప్రాజెక్టులను నిర్మించడానికి ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వాలి. కాని గత పది సంవత్సరాల అనుభవం చూస్తే ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణ పట్ల పాలకులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

టిఎంసీలు అందుబాటులో ఉండగా, ఇప్పటికీ వినియోగిస్తున్నది మాత్రం 278.751 టిఎంసీలు మాత్రమే. అంటే ఇంకా 497.964 టిఎంసీల నీరు వినియోగించుకోవడానికి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంది. అలాగే రాష్ట్రంలో 7,76,517 బోరుబావులు ఉన్నాయి. భూగర్భ జలంగా మారే నీరు 355.000 టిఎంసీలు, వినియోగిస్తున్నది మాత్రం 245.000 టిఎంసీలు. అందుబాటులో ఉన్న ఈ నీటి అవకాశాలను సంపూర్తిగా వినియోగించుకునేందుకు చర్యలు చేపట్టడం ద్వారానే రాష్ట్ర సమగ్రావృద్ధి సాధ్యమవుతుంది.

ఆంధ్ర రాష్ట్రంలో వ్యవసాయ సాగుకు అనువైన భూమి 2,11,84,787 ఎకరాలు. అందులో ప్రస్తుతం సాగు అవుతున్నది 1,49,44,910 ఎకరాలు. రాష్ట్రంలో పూర్తయిన భారీ ప్రాజెక్టుల ద్వారా 50,76,074 ఎకరాలకు, మధ్యతరహా ప్రాజెక్టుల ద్వారా 6,09,288 ఎకరాలకు, చిన్న తరహా ప్రాజెక్టుల ద్వారా 26,14,250 ఎకరాలకు మొత్తం 82,99,612 ఎకరాలకు సాగు నీరు అందుతుంది. అయితే చిన్న తరహా ప్రాజెక్టులు అనగా చెరువులు, కుంటల కింద సాగు నీరు నికరంగా ఉండదు. అందువల్ల నికర సాగు ప్రభుత్వ లెక్కల కంటే వాస్తవ సాగులో తక్కువగా ఉంటుంది. ఏమైనప్పటికీ అధికారిక లెక్కల ప్రకారం చూసినా రాష్ట్రంలోని మొత్తం సాగు భూమిలో 55.5 శాతం సాగు భూమికి మాత్రమే సాగు నీరు అందుతుంది. ఇందులో రాయలసీమ పరిస్థితి మరింత దారుణంగా ఉంది.

కృష్ణా, గోదావరి, పెన్నా, వంశధార నదుల ద్వారా మన రాష్ట్రం వినియోగించుకోవడానికి వీలున్న నికర జలాలు (75 శాతం ఆధారంగా) 1554 టిఎంసీలు. ఇందులో నిర్మాణం పూర్తయిన భారీ ప్రాజెక్టుల ద్వారా 821.523 టిఎంసీలు, మధ్య తరహా ప్రాజెక్టుల ద్వారా 58.116, చిన్న తరహా ప్రాజెక్టుల ద్వారా 267.280 టిఎంసీలు మొత్తం 1146.871 టిఎంసీల నీటిని మాత్రమే వినియోగించుకోగలుగుతున్నాము. అనగా ఇంకో 407 టిఎంసీల నికర జలాలను ఏ ఆటంకాలు లేకుండా వినియోగించుకునేందుకు అవకాశం ఉంది. దానికి అవసరమైన కొత్త ప్రాజెక్టుల నిర్మాణం, ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టుల సామర్థ్యం పెంచితే అదనంగా కనీసం 40 లక్షల ఎకరాలకు ఆరుతడి పంటలకు సాగునీరు అందించవచ్చు.

పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు

2014-15 నుండి 2018-19 సంవత్సరాల మధ్య కాలంలో 56 సాగునీటి ప్రాజెక్టులకు (పోలవరంతో కలిపి) రూ.80,792 కోట్లు కేటాయించి రూ.56,894 కోట్లు ఖర్చు చేశారు. అయితే వీటిలో ఏ ఒక్క ప్రాజెక్టూ పూర్తికాలేదు. ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులను ఎంపిక చేసుకొని దశలవారీగా పూర్తిచేయాలని చాలా కాలంగా సిపిఎం, అలాగే నీటి రంగ నిపుణులు సూచిస్తున్నారు. అయితే ప్రభుత్వాలు వాటిని ఖాతరు చేయకుండా అన్ని ప్రాజెక్టులను ఆర్భాటంగా ప్రారంభించడం, మొబలైజేషన్ అడ్వాన్స్ పేరుతో కాంట్రాక్టర్లకు వందల కోట్లు ఇవ్వడం, అందులో పాలక పార్టీలు కమీషన్లు తీసుకోవడం జరుగుతున్నది. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం నూతనంగా 37 ప్రాజెక్టులను ఒకేసారి ప్రారంభించి 4 సంవత్సరాల్లో పూర్తి చేస్తామని ప్రకటించింది. వాస్తవంగా గత 56 ప్రాజెక్టులకు, ఇప్పుడు ప్రకటించిన 37 ప్రాజెక్టులకు కలిపి రూ.1,44,262 కోట్లు ఖర్చు చేయాల్సి వస్తుంది. అంత ఖర్చు చేసి ప్రాజెక్టులను ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల్లో పూర్తిచేయడం ఎలా సాధ్యమవుతుంది? అసంపూర్తిగా వున్న లేదా నిర్మాణంలో వున్న ప్రాజెక్టులు పూర్తయితే భారీ ప్రాజెక్టుల ద్వారా 580.692 టిఎంసీల నీటితో 50,95,394 ఎకరాలు, మధ్యతరహా ప్రాజెక్టుల ద్వారా 25.111 టిఎంసీల నీటితో 2,82,238 ఎకరాలు, చిన్నతరహా ప్రాజెక్టుల ద్వారా 3.742 టిఎంసీల నీటితో 58,052 ఎకరాలు మొత్తం 54,35,684 ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలి.

నిర్మాణ ఆలస్యం వల్ల పెరుగుతున్న ఖర్చులు

ప్రకటించిన ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయకపోవడంవల్ల ప్రారంభ అంచనాలకు నేటికి 409.9 శాతం ఖర్చు పెరిగింది. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న 9 ప్రధాన ప్రాజెక్టుల ప్రారంభ అంచనాలు, ఇప్పటి వరకు చేసిన ఖర్చులు, వీటని పూర్తి చేయడానికి అవసరమైన అంచనాల వివరాలు పరిశీలిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రాజెక్టుల పరిస్థితులపై 31-03-2019న సమీక్షించారు. ఆ సమీక్ష నివేదికల ప్రకారం తెలుగు గంగ, గాలేరు, నగరి, హంద్రీ-నీవా, శ్రీశైలం కుడికాలువ, పూల సుబ్బయ్య వెలిగొండ, గుండ్లకమ్మ, వంశధార-2 (1,2), తోటపల్లి బ్యారేజి, చింతలపూడి లిఫ్ట్‌లకు కలిపి ప్రారంభ అంచనాల మొత్తం రూ.13,614 కోట్లు. 31-03-2019 నాటికి ఈ ప్రాజెక్టుల నిర్మాణానికి పెరిగిన అంచనా మొత్తం రూ.47,673 కోట్లు. ఇదే తేదీ నాటికి ఖర్చు చేసిన మొత్తం రూ.36,597 కోట్లు. ఈ ప్రాజెక్టులను 2023 చివరి నాటికి పూర్తి చేయడానికి అయ్యే అంచనా ఖర్చు రూ.19,208 కోట్లు. ఈ లెక్కన సకాలంలో ప్రాజెక్టులను పూర్తి చేసివుంటే అదనంగా మరో 30 ప్రాజెక్టులను నిర్మించి వుండవచ్చు.

నిధుల కేటాయింపులు-ఖర్చులు

ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వాల అనుభవం చూస్తే ప్రకటనలకు, కేటాయింపులకు, వాస్తవ ఖర్చులకు పొంతన లేదు. 2014 నుండి 2019 వరకు తెలుగుదేశం పార్టీ పాలనా కాలంలో సాగునీటి ప్రాజెక్టుల కోసం రాష్ట్ర బడ్జెట్లో కేటాయించింది రూ.80,792 కోట్లు, ఖర్చు పెట్టింది రూ.56,894 కోట్లు. 2019 నుండి 2023 వరకు వైసిపి పాలనలో కేటాయించింది రూ.61,573.15 కోట్లు, ఖర్చు చేసింది రూ.32,059.61. ఈ లెక్కన ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి కావాలంటే ఎన్ని దశాబ్దాలు పడుతుందో? అందరూ శాఖాహారులే కోడి మాయమైందన్నట్లు పాలక, ప్రతిపక్ష పార్టీలు వెనుకబడిన ప్రాంతాల గురించి, వ్యవసాయాభివృద్ధి గురించి మాట్లాడేవారే కాని... సాగునీటి వనరులు కల్పించకుండా వ్యవసాయం, వెనుకబడిన ప్రాంతాలు ఎలా అభివృద్ధి అవుతాయి?

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు/

★



రైతుబాంధవుడికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న సిపిఎం తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి కె బాలకృష్ణన్, కేంద్ర కమిటీ సభ్యులు యు వాసుకి తదితరులు



'ద హిందూ' గ్రూప్ డైరెక్టర్ ఎన్ రామ్ నివాళి



1965లో నార్మన్ బోర్లాగ్ (ఎడమ నుంచి మూడో వ్యక్తి)తో కలిసి గోధుమ వంగడాలను పరిశీలిస్తున్న ఎంఎస్ స్వామినాథన్ (రెండో వ్యక్తి)



నివాళులర్పిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సౌమ్య స్వామినాథన్

ఆహార భద్రత కోసం కృషి చేసిన దార్శనికుడు

స్వామినాథన్‌కు రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోడీ ప్రభృతుల నివాళి

న్యూఢిల్లీ : అంతర్జాతీయంగా ప్రఖ్యాతిగాంచిన వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ మరణం నన్ను ఎంతగానో బాధించిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. ఆహార భద్రతను సాధించడానికి విశేషంగా కృషి చేసిన దార్శనికుడు, ఆహార ధాన్యాలలో మన దేశానికి స్వావలంబనను అందించిన హరిత విప్లవ పితామహుడు. అగ్రికల్చర్ సైన్స్‌లో పరిశోధనలకు మార్గదర్శకత్వం వహించి పద్మవిభూషణ్ నుంచి ప్రతిష్టాత్మక వరల్డ్ ఫుడ్ ప్రైజ్ వరకు అనేక అవార్డులను పొందారు. భారతీయ వ్యవసాయ శాస్త్రం యొక్క గొప్ప వారసత్వాన్ని మనకు వదిలివెళ్లారు. మానవాళికి సురక్షితమైన, ఆకలి లేని భవిష్యత్తు దిశగా ప్రపంచాన్ని నడిపించడానికి ఆయన చూపిన మార్గం ఉపయోగపడుతుంది.

దేశానికి ఆహార భద్రత కల్పించారు : ప్రధాని మోడీ

ఎంఎస్ స్వామినాథన్ చేసిన కృషి లక్షలాది మంది జీవితాలను మార్చివేసింది. దేశానికి ఆహార భద్రత కల్పించింది. ఆవిష్కరణలకు ఆయన పవర్‌హౌస్. చాలా మందికి స్ఫూర్తిని ఇచ్చే గురువు. పరిశోధన–మార్గదర్శకత్వం పట్ల స్వామినాథన్ అచంచలమైన నిబద్ధత లెక్కలేనన్ని శాస్త్రవేత్తలు, ఆవిష్కరకర్తలపై చెరగని ముద్ర వేసింది. భారతదేశ పురోగతిని కాంక్షించే స్వామినాథన్ అభిరుచి శ్రేష్టమైనది. స్వామినాథన్‌తో నేను జరిపిన సంభాషణలను ఎప్పుడూ ఆదరిస్తాను. స్వామినాథన్ చేసిన కృషి రాబోయే తరాలకు స్ఫూర్తినిస్తుంది.

త్రిపుర ప్రజలు ఎప్పటికీ మరచిపోరు : మాజీ సిఎం మాణిక్ సర్కార్

ఈ యుగంలో విశిష్టమైన వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ మరణవార్త తనను ఎంతగానో కలచివేసిందని త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ పేర్కొన్నారు. త్రిపురలో లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వ హయాంలో మా అభ్యర్థనను మన్నిస్తూ స్వామినాథన్ ఒకటి కంటే ఎక్కువసార్లు రాష్ట్రాన్ని సందర్శించారని, వివిధ ప్రాంతాల్లో పర్యటించి, రైతులతోను, త్రిపుర వ్యవసాయ శాస్త్రవేత్తలతో చర్చించారని మాణిక్ సర్కార్ గుర్తు చేసుకున్నారు. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో త్రిపుర స్వయం సమృద్ధిని సాధించడానికి అత్యంత విలువైన సలహాలను అందించిన స్వామినాథన్‌ను వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించే ప్రజలు ఆ జ్ఞాపకాలను ఎప్పటికీ మరిచిపోలేరని అన్నారు.

స్వామి నాథన్ కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుంది : కేరళ సిఎం పినరయి విజయన్

భారత హరిత విప్లవ రూపశిల్పి డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ వ్యవసాయం యొక్క అభివృద్ధిలో నిజమైన దూరదృష్టి కలిగినవారు. మార్గదర్శకులు. ఆహార భద్రత, రైతుల జీవితాలను మెరుగుపరిచేందుకు స్వామినాథన్ చేసిన అవిశ్రాంత కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానించే వారికి హృదయపూర్వక సానుభూతి.

ప్రపంచంపైనే ప్రభావం చూపింది : తమిళనాడు సిఎం స్టాలిన్

సుస్థిర ఆహార భద్రత రంగంలో స్వామినాథన్ చేసిన కృషి ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ప్రభావం చూపింది. 'నేను అతనితో గడిపిన క్షణాలను నేను ఎప్పుడూ ప్రేమిస్తాను. ఈ క్లిష్ట సమయంలో నా ఆలోచనలు స్వామినాథన్ కుటుంబం, గ్లోబల్ సైన్స్ కమ్యూనిటీతో ఉన్నాయి. స్వామినాథన్ 1989–91, 1996–2000 సంవత్సరాల మధ్య తమిళనాడు రాష్ట్ర ప్రణాళికా సంఘం సభ్యునిగా నిర్మాణాత్మక ఆలోచనలను అందించారు. స్వామినాథన్ నాతోనూ, మాజీ ముఖ్యమంత్రి ఎం. కరుణానిధితోనూ మంచి స్నేహాన్ని నడిపారు. 1989లో కరుణానిధి కేటాయించిన స్థలంలోనే ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ గత మూడు దశాబ్దాల నుంచి పనిచేస్తుంది.

వ్యవసాయానికి ఎనలేని సేవలు : ఎఐకెఎస్

వ్యవసాయ రంగానికి స్వామినాథన్ ఎనలేని సేవలందించారని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) కొనియాడింది. ఎంస్ మృతి పట్ల సంతాపం ప్రకటించింది. దేశంలో వ్యవసాయాభివృద్ధికి, రైతుల సంక్షేమానికి స్వామినాథన్ అద్భుతమైన కృషి చేశారని స్మరించుకుంది. ఆహారోత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడానికి ఎంఎస్ అమోఘమైన కృషి చేశారని తెలిపింది. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ ద్వారా దేశంలో వ్యవసాయాభివృద్ధికి ప్రపంచ స్థాయి పరిశోధనల వారసత్వాన్ని ఆయన అందుబాటులోకి తీసుకొచ్చారని కొనియాడింది. వ్యవసాయాభివృద్ధి లేకుండా దేశాభివృద్ధి జరగదని స్వామినాథన్ ధృడంగా విశ్వసించారని పేర్కొంది.

ఎఐఎడబ్ల్యుయు దిగ్భ్రాంతి

దేశం గర్వించదగ్గ హరిత ఉద్యమ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ మృతి దిగ్భ్రాంతిని కలిగించిందని అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ విజయ రాఘవన్, బి వెంకట్ పేర్కొన్నారు. స్వామినాథన్‌కు నివాళి అర్పిస్తూ... గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడం కోసం ఎంఎస్‌పి, సి ప్లస్ సి2 ఫార్ములాను రూపొందించడంలో జాతీయ వ్యవసాయ కమిషన్ ఛైర్మన్‌గా ఆయన చేసిన కృషి అఖిల భారత రైతాంగాన్ని కదిలించిందన్నారు. స్వామినాథన్ అగ్రేరియన్ స్టడీ సెంటర్ పేరుతో ఆహార పంటలతోపాటు భూ సమస్యలు, ఉపాధి అవకాశాలపై వారు రూపొందించిన అధ్యయన నివేదికలకు ప్రపంచస్థాయి గుర్తింపు పొందాయన్నారు. అఖిల భారత స్థాయిలో వివిధ భావాలు కలిగిన రైతు సంఘాలు వ్యవసాయ కార్మిక సంఘాలు కార్మిక ప్రజాసంఘాలను ఒక వేదిక మీదకు తీసుకొచ్చి జరుగుతున్న ఎస్కేయం ఉద్యమానికి ఆయన ప్రేరణగా నిలిచారని ఆయన సేవలను వారు కొనియాడారు. స్వామినాథన్ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

సమ్మతి వయస్సును 16ఏళ్లకు తగ్గించొద్దు

- 22వ లా కమిషన్ సిఫారసు

న్యూఢిల్లీ: యుక్తవయసులో సెక్స్‌ను నేరంగా పరిగణించడంపై తీవ్ర చర్చ జరుగుతున్న నేపథ్యంలో, 22వ లా కమిషన్, తన నివేదికలో, లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ (పోక్సో) చట్టం కింద కనీస సమ్మతి వయస్సును 18 నుంచి 16కి తగ్గించడాన్ని వ్యతిరేకించింది. ఈ మేరకు కమిషన్ తన నివేదికను బుధవారం కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖకు సమర్పించింది. "లాకమిషన్ నివేదికలో అనేక సిఫార్సులు చేసింది. పోక్సో చట్టం ప్రకారం సమ్మతి కనీస వయసును 18 నుండి 16కి తగ్గించడానికి ప్యానెల్ అనుకూలంగా లేదు, "అని తెలిపింది. పోక్సో చట్టం– 2012 ప్రకారం ఇద్దరు మైనర్‌ల మధ్య సమ్మతి ఉన్నప్పటికీ, 18 ఏళ్లలోపు వారికి అన్ని లైంగిక కార్యకలాపాలను నేరంగా పరిగణిస్తుంది. నవంబర్ 2012లో లైంగిక సంపర్కానికి కనీస సమ్మతి వయసు 16 నుండి 18 సంవత్సరాలకు పెంచబడింది. పోక్సో చట్టం కింద కేసుల సంఖ్య పెరగడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ, భారత ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ 2012 చట్టం ప్రకారం సమ్మతి వయస్సును సమీక్షించాలని కోరారు.

సభా హక్కుల కమిటీకి బిదూరీ వివాదం

న్యూఢిల్లీ : బిఎస్‌పి ఎంపి డానిష్ అలీని అసభ్యకరంగా, అభ్యంతరకరమైన మాటలతో దూషించిన బిజెపి ఎంపి రమేష్ బిదూరీపై పార్లమెంట్ సభ్యులు చేసిన ఫిర్యాదులను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సభా హక్కుల కమిటీకి నివేదించారని సంబంధిత వర్గాలు గురువారం తెలిపాయి. బిదూరీపై చర్యలు తీసుకోవాలంటూ అలీ, అదిర్ రంజన్ చౌదరి, కనిమొళిలతో సహా పలువురు ప్రతిపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. కాగా బిదూరీని రెచ్చగొట్టేలా అలీ మాట్లాడారని, స్పీకర్ ఈ విషయాన్ని కూడా పరిశీలించాలని నిషికాంత్ దూబే, ఇతర బిజెపి ఎంపిలు కోరారు.

తమిళనాడు రైతులకు ఎఐకెఎస్ అభినందనలు

న్యూఢిల్లీ : తమిళనాడులోని తిరు అరూరన్ షుగర్స్ లిమిటెడ్ చేసిన మోసాలకు వ్యతిరేకంగా చేసిన పోరాటంలో చెరకు రైతులు విజయం సాధించారు. రైతులకు అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) అభినందనలు తెలిపింది. తిరు అరూరన్ షుగర్స్ లిమిటెడ్ యాజమాన్యం రైతుల పేరుతో వారికి తెలియకుండా వివిధ జాతీయ బ్యాంకుల నుంచి రూ.130 కోట్లు రుణాలు తీసుకుంది. దీంతో తమ అంగీకారం లేకుండా తీసుకున్న బ్యాంకు రుణాలను రీకమిషన్ చేసేలోపు చెల్లించాలని రైతులు ఫ్యాక్టరీ ఆవరణలో గత 300 రోజులకు పైగా రిలే దీక్షలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 26న జిల్లా కలెక్టర్ నేతృత్వంలో అధికారులు చర్చలు జరిపి అరూరన్ షుగర్స్ తీసుకున్న 115 కోట్ల రూపాయల రుణాన్ని కార్పొరేట్ డిఫాల్టర్‌కు బదిలీ చేసి రైతులను అప్పుల నుండి విముక్తి చేశారు. అలాగే ఈ ఫ్యాక్టరీని కొత్తగా స్వాధీనం చేసుకున్న కాల్స్ డిస్టిలరీ లిమిటెడ్ చెరుకు రైతులకు మొత్తం చెరకు బకాయిలను (ఎఫ్ఆర్‌పి) చెల్లించేందుకు అంగీకరించింది. రైతులను దోపిడీ చేసి, మోసం చేస్తూ భారీ లాభాలు ఆర్జించిన కార్పొరేట్ డిఫాల్టర్లకు వ్యతిరేకంగా పోరాడుతున్న రైతులకు ఇది పెద్ద విజయం. వీరి పోరాటం ఇతర ప్రాంతాల్లో చెరకు రైతుల ఉద్యమాలకు స్ఫూర్తినిస్తుందని ఎఐకెఎస్ తెలిపింది.

అప్పుల భారతం

- విదేశీ రుణాలు రూ.52 లక్షల కోట్లు
- ఆర్‌బిఐ రిపోర్ట్‌లో వెల్లడి



న్యూఢిల్లీ : భారతదేశం అప్పుల కుప్పగా మారింది. మరోవైపు దేశ ఎగుమతులు క్షీణించడం, దిగుమతులు పెరగడంతో వాణిజ్య లోటు ఎగిసిపడి.. తద్వారా కరెంట్ అకౌంట్‌పై తీవ్ర ఒత్తిడి పెరిగిందని ఆర్‌బిఐ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుత ఏడాది జూన్ చివరి నాటికి విదేశీ రుణాలు 629.1 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. భారత కరెన్సీలో ఇది దాదాపు రూ.52 లక్షల కోట్లకు సమానం. గురువారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) వెల్లడించిన గణంకాల ప్రకారం.. ప్రస్తుత ఏడాది మార్చి చివరి నాటికి 624.3 బిలియన్లుగా ఉన్న విదేశీ అప్పులు మరో 4.7 బిలియన్లు పెరిగాయి. '2023 మార్చి చివరి నాటికి జిడిపిలో విదేశీ అప్పులు 18.8 శాతంగా ఉండగా.. 2023 జూన్ చివరి నాటికి 18.6 శాతంగా నమోదయ్యాయి. ఇందులో 54.4 శాతం వాటాతో అమెరికన్ డాలర్ విలువ కలిగిన రుణాలున్నాయి. భారత రూపాయల్లో 30.4 శాతం, ఎస్‌డిఆర్ 5.9 శాతం, యెన్ 5.7 శాతం, యూరో 3.0 శాతం చొప్పున నిష్పత్తి విలువ కలిగిన అప్పులున్నాయి' అని ఆర్‌బిఐ తెలిపింది.

జూన్ 2023 చివరి నాటికి దీర్ఘకాలిక రుణం (ఒక సంవత్సరం పైన ఉన్న అసలు మెచ్యూరిటీతో) 505.5 బిలియన్ల అప్పులున్నాయి. ఇది ఇంతక్రితం త్రైమాసికం ముగింపుతో పోల్చితే 9.6 బిలియన్లు పెరిగింది. మొత్తం విదేశీ రుణంలో స్వల్పకాలిక రుణాల వాటా (ఒక సంవత్సరం వరకు మెచ్యూరిటీతో) 2023 మార్చి చివరి నాటికి 20.6 శాతం నుండి ఈ ఏడాది జూన్ చివరి నాటికి 19.6 శాతానికి తగ్గాయి. మోడీ ప్రభుత్వం స్వల్పకాల అప్పులను తగ్గించుకుని.. దీర్ఘకాల రుణాలను పెంచుకోవడం ద్వారా ప్రజలపై మరింత అదనపు భారం మోపినట్లయ్యింది.

ఏడు రెట్లయిన కరెంట్ ఖాతా లోటు

భారత కరెంట్ అకౌంట్ లోటు (సిఎడి) ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. ఆర్‌బిఐ గణాంకాల ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో సిఎడి ఏకంగా ఏడు రెట్లు ఎగిసి 9.2 బిలియన్ డాలర్లుగా చోటుచేసుకుంది. ఇంతక్రితం త్రైమాసికంలో ఇది 1.3 బిలియన్ డాలర్లుగా నమోదైంది. దేశ ఎగుమతుల కంటే దిగుమతులు ఎక్కువగా ఉండటంతో విదేశాలకు భారత చెల్లింపులు అధికంగా ఉండటమే కరెంట్ అకౌంట్ లోటు. గడిచిన జూన్ త్రైమాసికంలో జిడిపిలో కరెంట్ అకౌంట్ లోటు 1.1 శాతానికి పెరిగిందని ఆర్‌బిఐ వెల్లడించింది. వాణిజ్య లోటు పెరగడంతో కరెంట్ లోటు ఎగిసిందని పేర్కొంది. ప్రధానంగా కంప్యూటర్, ట్రావెల్, వ్యాపార సేవల ఎగుమతుల క్షీణత కారణంగా నికర సేవల రసీదులు క్రమంగా తగ్గాయని తెలిపింది.

2023 జూన్ త్రైమాసికంలో భారత సరుకుల వాణిజ్య లోటు 55.6 బిలియన్లకు పెరిగింది. ఇంతక్రితం ఏప్రిల్‌లో త్రైమాసికంలో ఇది 52.6 బిలియన్లుగా చోటుచేసుకుంది. మరోవైపు విదేశాల్లోని భారతీయుల రెమిటెన్స్‌లు 28.6 బిలియన్ల నుంచి 27.1 బిలియన్లకు తగ్గాయి. ప్రస్తుత జులై – సెప్టెంబరు త్రైమాసికంలో కరెంట్ అకౌంట్ లోటు నిష్పత్తి రెండితలు పెరిగి జిడిపిలో 2.4–2.6 శాతం వరకు చేరొచ్చని ఎంకే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లీడ్ ఎకనామిస్ట్ మాధవి అరోరా పేర్కొన్నారు. జులై–సెప్టెంబర్‌లో సిఎడి 19–21 బిలియన్లకు ఎగిసి జిడిపిలో 2.3 శాతానికి చేరే అవకాశం ఉందని ఇక్రా ముఖ్య ఆర్థికవేత్త అదితి నాయర్ తెలిపారు.

కోటాలో మరో నీట్ విద్యార్థి ఆత్మహత్య

జైపూర్: రాజస్థాన్‌లోని కోటాలో నీట్ పరీక్షకు ప్రిపేర్ అవుతున్న మరో విద్యార్థి ఒత్తిడికి గురై ఆత్మహత్య చేసుకున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సదరు విద్యార్థి స్వతహాగానే నీట్‌కు ప్రిపేర్ అవుతూ..గత బుధవారం ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు గురువారం వెల్లడించారు. దీంతో నీట్‌కు ప్రిపేర్ అవుతూ మానసిక ఒత్తిడికి గురై కోటా ప్రాంతంలో బలవన్మరణానికి పాల్పడిన విద్యార్థుల సంఖ్య 26కు చేరింది. నీట్ పరీక్షకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం పదేపదే మార్పులు చేస్తుండటం, ఉత్తీర్ణత సాధించలేమోనన్న భయం విద్యార్థులపై మానసిక ఒత్తిడికి దారితీస్తున్నట్లు సంబంధిత నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రతిభతో సంబంధం లేకుండా సున్నా మార్కులు వచ్చిన వారు (జీరో పర్సెంటైల్) కూడా మెడికల్ పిజి కోర్సులకు అర్హులేనంటూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం నీట్‌ను, ఆ పరీక్షకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులను అవమానర్చేలా నిబంధనలను సడలించిన సంగతి తెలిసిందే. కేవలం రూ.కోట్లాది సొమ్మును ఫీజులుగా చెల్లించేవారికే మెడికల్ పిజి సీట్లను రిజర్వుచేసినవిధంగా కేంద్రం చర్యలున్నాయని విద్యా రంగ నిపుణులు ఆందోళన కూడా వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

ఈ నేపథ్యంలో నీట్‌కు ప్రిపేర్ అవుతున్న విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం గమనార్హం. కాగా నీట్‌తో పాటు ఇతర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు రొటీన్ పరీక్షలను రెండు నెలల పాటు నిలిపివేయాలని కోటా జిల్లా యంత్రాంగం ఇటీవల కోచింగ్ ఇనిస్టిట్యూట్‌లను ఆదేశించింది.



8వ ఖండం జీలాండియా

వెల్లింగ్టన్: ఇప్పటివరకు ఏడు ఖండాల గురించే విన్నాం. ఇప్పుడు జీలాండియా అనే ఎనిమిదవ ఖండాన్ని కనుగొన్నామని న్యూజిలాండ్ శాస్త్రీయ బందం ప్రకటించింది. దీనికి సంబంధించి సవరించిన మ్యాప్‌ను సిద్ధం చేశారు. పశ్చిమ అంటార్కిటికా భౌగోళిక నిర్మాణాన్ని పోలిన ప్రాంతం సముద్రపు అడుగుభాగంలో 3500 అడుగుల లోతులో ఉందని, ప్రధాన భూభాగంలో 94 శాతం నీటిలో ఉందని ఆ బృందం తెలిపింది. న్యూజిలాండ్ క్రౌన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ జరిపిన అధ్యయనం తాలూకు ఫలితాలు టెక్టోనిక్స్‌తో సహా ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఇది అతి పిన్న వయసు కలిగిన అతి చిన్న, అత్యంత సున్నితమైన ఖండమని పరిశోధనా బందం చెబుతోంది. పసిఫిక్ మహాసముద్రం దిగువ నుండి సేకరించిన రాళ్ళు,మట్టిని అధ్యయనం చేయడం ద్వారా జిలాండియా స్థలాకతి నిర్ణయించబడింది. డచ్ నావిగేటర్ అయిన అబెల్ టాస్మాన్ 1672లో ఎనిమిదవ ఖండం గురించి ప్రకటించాడు. 1895లో స్కాటిష్ ప్రకతి శాస్త్రవేత్త జేమ్స్ హెక్టర్, టాస్మాన్ కనుగొన్న న్యూజిలాండ్ సముద్రగర్భంలోని జీలాండియా ఉందని ఊహించాడు. 1995లో, అమెరికన్ జియోఫిజిసిస్ట్ బ్రూస్ లుయెండి జీలాండియాను ఒక ఖండంగా పరిగణించవచ్చని సూచించారు. దీనికి ఆ పేరు పెట్టింది ఆయనే. ఇది లోతట్టు ప్రాంతం కాబట్టి దీనిని భూభాగంగా పరిగణించవచ్చా అన్న మీమాంస తలెత్తింది.

తయారీ రంగంలో ఏది పురోగతి?

- పదో సంవత్సరంలోకి మేక్ ఇన్ ఇండియా
- ప్రభుత్వ మౌనానికి అర్థమేంటి?



న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం సెప్టెంబరు 25 నాటికి పదో సంవత్సరంలోకి ప్రవేశించింది. ప్రతి చిన్న సంఘటనను, కార్యక్రమాన్ని అట్టహాసంగా జరుపుకునే ఈ ప్రభుత్వం ఈ పదో వార్షికోత్సవం గురించి అస్సలు పట్టించుకోలేదు. ఇందుకు కారణాలు ఏమిటి?

మూడు ప్రధానమైన లక్ష్యాలతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఏడాదికి 12 నుండి 14 శాతం మేరకు తయారీ రంగం వృద్ధిరేటును పెంచడం, 2022 నాటికి జిడిపిలో 25 శాతం తయారీ రంగం వాటాను పెంచడం, 2022 నాటికి తయారీ రంగంలో 10 కోట్ల ఉద్యోగాలను సృష్టించడం లక్ష్యాలుగా పెట్టుకుంది. అయితే ఈ లక్ష్యాల్లో ఏ ఒక్కదాన్నీ ప్రభుత్వం సాధించలేకపోయింది. బహుశా అందుకనే ఈ వార్షికోత్సవాలను ఆర్భాటంగా చేసి వుండకపోవచ్చు. 2013–14 నుండి తయారీ రంగం వృద్ధి రేటు సగటున 5.9 శాతంగా వుంది. అలాగే తయారీ రంగం వాటా కూడా స్తంభించిపోయింది. 2022–23లో 16.4శాతం దగ్గరే నిలిచిపోయింది. 2016, 2021 మధ్య తయారీ రంగంలో ఉద్యోగాలు సగానికి సగం తగ్గిపోయాయి. మేక్ ఇన్ ఇండియా దశాబ్దంగా చెప్పుకునే ఈ కాలంలో తయారీ రంగంలో కార్మిక శక్తి బాగా క్షీణించింది. 2011–12లో 12.6 శాతం వుండగా, 2021–22లో 11.6 శాతానికి తగ్గిపోయింది. మేక్ ఇన్ ఇండియా పేరుతో తయారీ రంగంలో ఇంత పేలవమైన పనితీరును నమోదు చేస్తున్నా కొన్ని అసాధారణ సంఘటనలను కూడా సాధారణమైనవిలా ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. ఇందుకు యాపిల్ ఐ ఫోన్ తయారీ ప్రధాన ఉదాహరణగా వుంది. భారత్‌లో యాపిల్ ఐ ఫోన్ల ఉత్పత్తి మూడు రెట్లు పెరిగిందని చెబుతున్నారు. దాదాపు 7 శాతం ఫోన్లు ఇప్పుడు దేశంలోనే తయారవుతున్నాయి. దీంతో తయారీ రంగం అద్భుతంగా పనిచేస్తున్నదనడానికి ప్రభుత్వం దీన్ని ఉదాహరణగా చెబుతోంది. కానీ గణాంకాలను నిశితంగా పరిశీలిస్తే అవన్నీ బూటకమేనని అర్థమైపోతుంది. వాస్తవానికి తయారీ రంగం చాలా నిరుత్సాహంగా వుంది. పెద్దఎత్తున నిరుద్యోగిత నెలకొంది. యువతలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. అక్కడో ఫ్యాక్టరీ, ఇక్కడో ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే సరిపోదు. భారత్‌కు వందలాది కొత్త ఫ్యాక్టరీలు అవసరం. రాష్ట్రాలవారీ ఏర్పాటు చేసే ఆ ఫ్యాక్టరీలు వివిధ వర్గాలు వినియోగించే ఉత్పత్తులను తయారుచేయాల్సి వుంటుంది. యుపిఎ హయాంలో దాదాపు లక్షకు పైగా ఫ్యాక్టరీల సంఖ్య పెరిగింది. కానీ 2013–14, 2019–20 మధ్య కాలంలో ఈ సంఖ్య కేవలం 22 వేలే పెరిగింది. యుపిఎ హయాంలో మరిన్ని ఉపాధి అవకాశాలు పెరిగాయి. ఏటా 6.2 శాతం ఉద్యోగల సంఖ్య పెరిగింది. కానీ మోడీ హయాంలో ఈ సంఖ్య 2.8 శాతానికి పడిపోయింది. అలాగే కార్మికుల వేతనాలు కూడా క్షీణించాయి. యుపిఎ కాలంలో కార్మికుల వేతనాలు ఏటా 17.1 శాతం చొప్పున పెరగగా, 2014 నుండి 8.4 శాతానికి పడిపోయాయి.

ఒక విధానాన్ని సమీక్షించడానికి ఒక దశాబ్ద కాలమంటే చాలా ఎక్కువ సమయం. ఒక కార్యక్రమం పదే పదే విఫలమైందంటే, మరింత ప్రభావవంతమైన దాని కోసం దీన్ని పక్కనబెట్టాల్సిన సమయం ఆసన్నమైందనుకోవచ్చు.

హరిత విప్లవ పితామహుడు

స్వామినాథన్ కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

డిగ్రీ చదివారు. 1949లో ఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ నుండి సైటో జెనెటిక్స్‌లో పీజీ చేశారు. ఆ తర్వాత నెదర్లాండ్స్ వెళ్లి అక్కడి వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బంగాళదుంపల జన్యువులపై పరిశోధనలు చేశారు. 1950లో కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి చెందిన ప్లాంట్ బ్రీడింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరి పీహెచ్‌డీ చేశారు. అంతేకాదు...విస్కాన్సిన్ వర్సిటీలోని జెనెటిక్స్ విభాగంలో పోస్ట్ డాక్టరల్ పరిశోధన చేశారు. 1954లో స్వదేశానికి తిరిగి వచ్చి భారత వ్యవసాయ పరిశోధనా సంస్థలో శాస్త్రవేత్తగా చేరారు. వ్యవసాయ పరిశోధనలకు సంబంధించి పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థలకు ఆయన నేతృత్వం వహించారు. వాటి ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థలో జెనెటిక్స్ విభాగాన్ని, అణు పరిశోధనా ప్రయోగశాలను ఆయనే ఏర్పాటు చేశారు. ఫిలిప్పీన్స్‌లో అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ అధిపతిగా పనిచేశారు. దేశంలోని ఉష్ణ మండల ప్రాంతాల కోసం అంతర్జాతీయ పంటల పరిశోధనా కేంద్రం ఏర్పాటులో భాగస్వామి అయ్యారు. ఇటలీలో మొక్కల జన్యు వనరులకు సంబంధించి అంతర్జాతీయ బోర్డు ఏర్పాటులో, కెన్యాలో వ్యవసాయ–అటవీ భూములకు సంబంధించి అంతర్జాతీయ పరిశోధనా మండలి ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు.

వరి, గోధుమ పంటలపై ఆయన చేసిన పరిశోధనల కారణంగా దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. తద్వారా దేశం హరిత విప్లవాన్ని సాధించింది. స్వామినాథన్ ఎన్నో పదవులను చేపట్టి వాటికి వన్నె తెచ్చారు. మరెన్నో పురస్కారాలు ఆయన్ని వరించాయి. 1972–1979 మధ్యకాలంలో భారత వ్యవసాయ పరిశోధనా మండలి డైరెక్టర్ జనరల్‌గా, 1979–1980లో కేంద్ర వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శిగా, 1982–1988 మధ్య అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ డైరెక్టర్ జనరల్‌గా పనిచేశారు. 2019–22 మధ్యకాలంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రధాన శాస్త్రవేత్తగా పనిచేశారు. 20వ దశాబ్దంలో ఆసియా ప్రజలను అధికంగా ప్రభావితం చేసిన వారితో టైమ్స్ పత్రిక రూపొందించిన జాబితాలో స్వామినాథన్ పేరును చేర్చారు. స్వామినాథన్ 1987లో చెన్నైలో తన పేరిట రిసెర్చ్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు.

అవార్డుల పరంపర

హరిత విప్లవ మార్గదర్శకుడు ఎంఎస్ స్వామినాథన్ సేవలకు గుర్తింపుగా ఆయనను అనేక అవార్డులు వరించాయి. 1967లో పద్మశ్రీ, 1972లో పద్మభూషణ్, 1989లో పద్మవిభూషణ్ అవార్డులు పొందారు. 1971లో రామన్ మెగసెసే అవార్డును, 1986లో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ ప్రపంచ సైన్స్ అవార్డును అందుకున్నారు. 1987లో వ్యవసాయ పరిశోధనలో అత్యున్నత పురస్కారం ప్రపంచ ఫుడ్ అవార్డు ఆయనను వరించింది. 1989లో ఇందిరాగాంధీ శాంతి బహుమతి, 2013లో ఇందిరాగాంధీ సమైక్యతా పురస్కారం లభించాయి.

ప్రసాదం తిన్నాడని ముస్లిం మానసిక వికలాంగుడి హత్య

- సిపిఎం ఖండన

న్యూఢిల్లీ : గణేష్ మండపం నుంచి ప్రసాదం తీసుకున్నాడనే కారణంతో ఈశాన్య ఢిల్లీలోని సుందర్‌నగరిలో మానసిక వికలాంగుడైన ముస్లిం యువకుడ్ని దారుణంగా హత్య చేశారు. 26 ఏళ్ల ఇసార్‌ను ఒక విద్యుత్ స్థంభానికి కట్టివేసిన కొంత మంది దుండగులు కర్రలతో తీవ్రంగా కొట్టారు. తీవ్రగాయాలతో ఇసార్ మరణించాడు. మృతుడి తండ్రి ఫిర్యాదుతో ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఒక బాలుడితో సహా ఏడుగుర్ని పోలీసులు అరెస్టు చేశారు. కాగా, ఈ దారుణ ఘటనను సిపిఎం ఢిల్లీ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ విద్వేషపూరిత నేరానికి పాల్పడిన వారందరిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఢిల్లీ పోలీస్ కమిషనర్ సంజయ్ అరోరాకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె ఎం తివారీ లేఖ రాశారు. ఈ ప్రాంతంలో మత విద్వేషాలను వ్యాప్తి చేయడంలో కొన్ని తీవ్రవాదు గ్రూపు పాత్రపైనా విచారణ చేయాలని కోరారు.

డ్రగ్స్ కేసులో కాంగ్రెస్ ఎమ్మెల్యే అరెస్ట్

చండీగఢ్: ఓ డ్రగ్స్ సంబంధిత కేసులో భోలాత్ నియోజకవర్గ ఎమ్మెల్యే సుఖ్‌పాల్ సింగ్ ఖైరాను గురువారం ఉదయం చండీగఢ్‌లోని ఆయన నివాసంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జలాలాబాద్ పోలీసులు ఈ ఉదయం ఎమ్మెల్యే నివాసంలో సోదాలు జరిపారు. పోలీసుల తనిఖీల సమయంలో ఎమ్మెల్యే ఖైరా ఫేస్‌బుక్‌లో లైవ్ ఏర్పాటు చేశారు. ఈ వీడియోలో తనను ఎందుకు అరెస్ట్ చేస్తున్నారని పోలీసులతో సుఖ్‌పాల్ సింగ్ వాగ్వాదానికి దిగారు. అరెస్ట్‌కు సంబంధించి వారెంట్ చూపించాలని అడగటం కూడా కనిపిస్తోంది.

మణిపూర్‌లో బిజెపి కార్యాలయానికి నిప్పు

ఇంఫాల్ : మణిపూర్‌లో విద్యార్థుల హత్యలపై స్థానిక ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. నిరసనగా ఆందోళనకారులు రాష్ట్రంలో ఒక బీజేపీ మండల కార్యాలయానికి నిప్పు పెట్టింది. ఇటీవల రాష్ట్రంలో ఇద్దరు విద్యార్థుల హత్యలు తీవ్ర కలకలం రేపాయి. దీనికి నిరసనగానే ఆందోళనకారులు పెద్ద ఎత్తున గుమిగూడారు. తౌబాల్ జిల్లాలో ఉన్న కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకొని నిప్పు పెట్టారు. కార్యాలయం గేటును ధ్వంసం చేశారు. అద్దాలను పగులగొట్టి, ఆవరణలో నిలిపి ఉంచిన వాహనం అద్దాలను పగలగొట్టారు. నిరసనకారులు టైర్లను తగులబెట్టి, చెక్క దుంగలు, ఉపయోగించని విద్యుత్ స్తంభాలను ఉపయోగించి ఇండో–మయన్మార్ హైవేను అడ్డుకున్నారు. రాళ్లతో దాడికి దిగారు. అయితే, ఈ గుంపును చెదరగొట్టడానికి జిల్లా అధికారిక యంత్రాంగం రంగంలోకి దిగింది. టియర్ గ్యాస్ షెల్‌లు, మాక్ బాంబులు, లైవ్ బుల్లెట్‌లను ప్రయోగించింది. దీంతో అక్కడి పరిస్థితి తీవ్రంగా మారింది.



అమృతసర్‌లో పట్టాలపై బైఠాయించిన రైతులు

అమృతసర్ : ఇటీవల సంభవించిన వరదల నష్టాల నుండి బయటపడవేసే ఆర్థిక ప్యాకేజీ ఇవ్వాలని, కనీస మద్దతు ధరకు చట్టపరమైన హామీ కల్పించాలని, రుణాలను రద్దు చేయాలని కోరుతూ మూడు రోజుల పాటు రైల్ రోకో ఆందోళనకు పంజాబ్ రైతాంగం సిద్ధమైంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో వివిధ రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతులు గురువారం పట్టాలపై బైఠాయించారు. 30వ తేదీ వరకు ఈ ఆందోళనలు కొనసాగుతాయి. మొగా, హొషియార్‌పూర్, గురుదాస్‌పూర్, జలంధర్, తరన్ తరన్, సంగ్రూర్, పాటియాలా, ఫిరోజ్‌పూర్, భటిండా, అమృత్‌సర్‌ల్లో రైతులు ఆందోళనలు నిర్వహించనున్నారు. అమృతసర్‌లో అమృతసర్–ఢిల్లీ రైల్వే ట్రాక్‌పై రైతులు బైఠాయించారు. కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ, భారతి కిసాన్ యూనియన్ (క్రాంతికరి), బికెయు(ఏక్తా అజాద్), అజాద్ కిసాన్ కమిటీ దోబా, బికెయు(బెహ్రామ్‌కె), బికెయు(షహీద్ భగత్‌సింగ్), బికెయు(ఛోటూ రామ్)లు ఈ ఆందోళనల్లో పాల్గొంటున్నాయి. ఉత్తర భారత రాష్ట్రాలకు రూ.50వేల కోట్ల వరద సహాయక ప్యాకేజీ ఇవ్వాలని రైతు నేత గురుబచన్ సింగ్ డిమాండ్ చేశారు. రైతాంగం, రైతు కూలీల రుణాలను మొత్తంగా రద్దు చేయాలని కోరారు. వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని కోరుతూ జరిగిన ఆందోళనలో మరణించిన రైతు కుటుంబానికి 10లక్షల నష్టపరిహారం, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కౌలురైతులపై నిర్లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

2.48 లక్షల మంది కైలు రైతులకు మాత్రమే రూ.659 కోట్లు రుణాలు అందాయి. సాధారణ రైతులకు ఈ ఏడాది రాష్ట్రం మొత్తమ్మీద 47 లక్షల మందికి రూ.1,00,035 రుణాలు ఇచ్చారు. కౌలు రైతులకు మాత్రం ఒక్కొక్కరికి కనిష్టంగా రూ.20 వేలు, గరిష్టంగా రూ.30 వేలకు మించి పంట రుణాలు ఇవ్వడం లేదు. ఐదుగురు సభ్యులు ఉండే జాయింట్ లయబులిటీ గ్రూపు (జెఎల్‌బి)నకు గరిష్టంగా రూ.లక్ష మాత్రమే రుణాలు ఇస్తున్నారు. సిసిఆర్‌సిలు లేనివారికి రైతు భరోసా, పంటల బీమా అందడం లేదు. సిసిఆర్‌సిలు ఉన్నా ఒసి కౌలు రైతులకు ప్రభుత్వం రైతు భరోసా వర్తింపజేయడం లేదు. బీమా డబ్బులు భూ యజమాని ఖాతాల్లో జమ అవుతున్నాయి. ప్రభుత్వం సేద్యానికి అందిస్తోన్న సబ్సిడీలు కౌలు రైతుకు అందడం లేదు. పండించిన పంటను అమ్ముకోవాలన్నా గుర్తింపుకార్డు లేక భూ యజమాని పేరుతోనే అమ్ముకోవాల్సి వస్తోంది. కొంతమంది కౌలురైతులు అయినకాడికి ప్రయివేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. ఇ–క్రాప్, ఇకెవైసి సదుపాయం కౌలు రైతులందరికీ లేకపోవడం వల్ల వీరికి ప్రభుత్వం నుంచి నేరుగా రావాల్సిన వివిధ సదుపాయాలు అందడం లేదు.





మీకోసం

నీటిలో కొద్దిగా వంట సోడా కలిపి, ఆ నీటిలో వంటపాత్రలు, ప్లేట్లు, స్పూన్లు, గరిటెలు కడిగితే వాటికి పట్టిన వాసన పోతుంది.

జీవన సౌరభం

మిమ్మల్ని బలవంతులుగా చేసే ప్రతి ఆశయాన్ని స్వీకరించండి. బలహీనపరిచే ప్రతి ఆలోచనను తిరస్కరించండి.

మా ఊరి చెరువు



మంచి నీటికి నెలవు
మా ఊరి చెరువు
నీట చూడగ నాచు
పచ్చగా కనిపించు

చల్లని గాలులు వీచు
మదినెంతొ పులకించు
పిల్ల గాలుల తోడుగ
అలలతో అలరించు

చెరువు నిండుగ పూలు
ముచ్చటగొలుపు పూలు
అందాలు ఒలికించు
వాసనలు చిలికించు

ఉదయాన వికసించు
రవి కిరణం సోకగ
ఎరుపు రంగున పూలు
ఎఱ్ఱతామర పువ్వులు

రేరాజు వెన్నెలల
విరబూయో కలువలు
పలు జాతుల పూలు
పసిడి వెన్నెల వెలుగులు

నీటను ఈదే చేపలు,
ఎగిరి గంతులతో ఆటలు,
కిందకు మీదకుదుముకుతు,
జల పుష్పాలు కనిపించు,

నదుల నీరు తరిగిన,
మా చెరువే తరగదు,
వేసవిలో జనమంత,
పొందెదరు సుఖమంత,


పొరుగు పల్లెల జలము,
కష్టమైన తరుణము
మా చెరువే ఆధారం
కనికరము వారి చూడ,

పశువులను కడుగబోము,
చెత్తలే వేయబోము,
పెద్దల సుద్దుల వింటు,
సౌఖ్యముగా ఉంటాముబీ

సైబీరియా అతిథులు
వలస వచ్చే పక్షులు
పలు పక్షులా కూతలు
మా వీనులకు విందులు

జలము చేయును మేలు,
నీరు తాగితె చాలు,
ఆరోగ్యముగ ఉంటు,
భాగ్యాలు పొందెదము

- బెహరా ఉమామహేశ్వరరావు
92900 61336.



లెక్కచేయండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని పండ్ల బొమ్మలను అంకెలుగా గణించి సమాధానాలు ఇచ్చాం. చివరి వరుస సమాధానాన్ని బట్టి అరటిపండు అంకెను మీరు కనిపెట్టండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ



అనీసా బేగం,
సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్,
2వ తరగతి,
మచిలీపట్నం,
కృష్ణాజిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ప్రశాంతమైన జీవితంతోనే సంపూర్ణ ఆరోగ్యం

మనిషి
నేటి ఆధునిక జీవన శైలి ప్రభావం...
మితిమీరిన ఆహారపు అలవాట్లు... నిద్రలేమి సమస్యలు...
సరైన వ్యాయామం, శారీరక శ్రమ లేవి వంటి కారణాలతో గుండె జబ్బుల బారిన పడుతున్నాడు. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకూ ఈ వ్యాధి బారిన పడేవారి సంఖ్య వయసుతో నిమిత్తం లేకుండా రానురానూ పెరిగిపోతుండటం ఆందోళన కల్గించే విషయం. ప్రపంచవ్యాప్తంగా, భారతదేశంలో చూసినా మరణాల్లో 30 శాతం గుండె సంబంధిత వ్యాధులతోననే గణాంకాలు చెబుతున్నాయి. ఈ పరిస్థితుల్లో గుండెకు ముప్పు ఎప్పుడు వస్తుందో తెలుసుకుంటే దానిని అడ్డుకోగల మార్గాలు తెలుస్తాయి. నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఫలితంగా అనేక సమర్ధ పరికరాలు, ఆధునిక పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. గుండె జబ్బులపై అవగాహన, చికిత్సలో డాక్టర్ జుజ్జూరు శ్రీమన్నారాయణ అంతర్జాతీయ స్థాయిలో హృద్రోగ నిపుణులు. విజయవాడ నక్కలరోడ్డులోని ఆంధ్రా హార్ట్ అండ్ బ్రెయిన్ ఆసుపత్రి చీఫ్ కార్డియాలజిస్టు ఆయన. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రోగులు (అన్ని వయస్సుల వారికి) సులభంగా, నాణ్యమైన వైద్య సేవలు, శస్త్ర చికిత్సలు చేయటంలో ఆయన విశేషంగా పేరుగాంచారు. గుండె సంబంధిత చికిత్సలు, నివారణా పద్ధతులను ఆయన మాటల్లోనే తెలుసుకుందాం.





నేడు ప్రపంచ హృదయ దినం


మానవుడి శరీరంలో అతి ముఖ్యమైన అవయవం గుండె. శరీరానికంతటికీ రక్తాన్ని సరఫరా చేయటంతోపాటుగా అనేక రకాల విధులను హృదయం (గుండె) నిర్వర్తిస్తుంది. అయితే దాని నిర్వహణ తీరుపైన ఒత్తిడి పెంచితే వ్యాధుల బారిన పడతాం. సరైన ఆహారపు అలవాట్లు, మెరుగైన జీవనశైలి, ప్రశాంతమైన వాతావరణంలో ఉండగలిగితే గుండె సంబంధిత వ్యాధులు దరిచేరబోవు. ప్రతి ఒక్కరిలోనూ తమ గుండె బలహీనపడిందని తెలియగానే భయం, బాధ, ఆందోళన వంటివి కలుగుతాయి. పై లక్షణాలు ఉంటే వ్యాధిని మరింత తీవ్రం చేస్తాయి. అలా కాకుండా తమకు వచ్చిన వ్యాధిపై అవగాహన పెంచుకోవాలి.

జబ్బు ముదరకుండా చూసుకోవాలి

గుండె జబ్బుల్లో అనేక రకాలున్నాయి. వాటికి సకాలంలో గుర్తించగలగాలి. అప్పటికి జబ్బు స్థాయి ఏమిటో తెలుసుకోగలగాలి. అప్పుడు సరైన చికిత్స అందించగలగాలి. జబ్బు ముదిరిన కొద్దీ నిర్ధారణ తేలికైనా, చికిత్స కష్టం. ఆ స్థితిలో కొన్ని చికిత్సలకు సరైన చికిత్స అందించటం కష్టమవుతుంది. రోగ నిర్ధారణ చేసి సరైన చికిత్సనిచ్చినా కొన్ని గుండె జబ్బులు తగ్గవు. ఆ జబ్బు ఎందుకు వచ్చిందో తెలుసుకుని కారణానికి చికిత్స చేయనంతకాలం కష్టం. ఏ రోగికైనా మాసివ్ హార్ట్ ఎటాక్ వచ్చి, గుండె బాగా దెబ్బతిని పెద్దదైందనుకోండి. అప్పుడు గుండెకు శస్త్ర చికిత్స చేసి కొంత కండరాన్ని తీసేస్తారు. గుండె పరిమాణాన్ని తగ్గిస్తే ఆ రోగికి మళ్లీ బాగా స్వస్థత చేకూరే అవకాశం ఉంది. ఇవేవీ పనిచేయలేదనుకుంటే అప్పుడు గుండె మార్పిడి గురించి ఆలోచించాలి. 55 ఏళ్ల లోపు వయస్సు వారు మిగతా అవయవాలన్నీ ఆరోగ్యంగా ఉంటే గుండె మార్పిడి శస్త్ర చికిత్సకు అర్హులు.

98 శాతం గుండె శస్త్ర చికిత్సలు విజయవంతం

గుండె రంధ్రాలను మూయటం, కవాటాలను (వాల్స్) మార్చడం, బైపాస్ సర్జరీ లాంటి శస్త్ర చికిత్సలు చాలా అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం గుండె శస్త్ర చికిత్సల్లో కొత్త పద్ధతులు రోగులకు ఎంతో మేలు చేకూరుస్తున్నాయి. హార్ట్‌లంగ్ మిషన్‌లో మత్తు ఉంచే పద్ధతులతోపాటుగా శస్త్ర చికిత్స చేసే నైపుణ్యాల్లో కూడా కొత్త యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి.



పెద్ద వాళ్లలో మేజర్ కాంప్లికేషన్స్ ఉన్న వాళ్లలో కూడా 98 శాతం ఆపరేషన్లు విజయవంతమవుతున్నాయి. అయితే ఇంకా కొంతమంది రోగుల్లో గుండె, మూత్రపిండాలు దెబ్బతిన్న వారిలోనూ, రక్తప్రసరణ లోపాలున్న వాళ్లలో గుండె శస్త్ర చికిత్సల్లో కొంత రిస్క్ ఉంటుంది. గుండె ఆపినప్పుడు ఉపయోగించే ఆర్టిఫీషియల్ సర్క్యూట్‌తో రక్తస్రావం, పక్షవాతం రావొచ్చు. అలాగే బ్రెస్ట్‌బోన్ మీద ఇచ్చే కోత మీద ఒక్కోసారి స్కాచ్ (మచ్చ) పెద్దదై (కిలాయిడ్) దురదలు పుట్టడంతోపాటు ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటున్నాయి. శస్త్ర చికిత్స జరిగిన తర్వాత రోగి ఒక వారం నుంచి పది రోజుల వరకూ ఆసుపత్రిలో గతంలో ఉండాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ అవసరం లేకుండా పోయింది.



గుండె ఆపకుండానే బైపాస్ సర్జరీ

గతంలో మాదిరిగా రక్తనాళాలను ఆర్టిఫిషియల్ హార్ట్‌లంగ్ మిషన్‌తో కలిపి గుండె శస్త్ర చికిత్సలు చేయకుండా గుండె కొట్టుకుంటునప్పుడే బైపాస్ సర్జరీ చేస్తున్నాం. పెద్ద కోతలు లేకుండా చిన్న రంధ్రాల్లో నుంచి పొట్టలో ల్యాప్రోస్కోపిప్ సర్జరీలను ఎలా చేస్తున్నారో, అలాగే కొన్ని గుండె శస్త్ర చికిత్సలను చేసే విధానాలు వచ్చాయి. ఇలా గుండెలో రంధ్రాలకు, కొన్ని రకాల కవాటాలను మార్చటానికి మినిమల్లీ ఇన్ వేజ్ సర్జరీలు చేస్తున్నాం. తోరాకో స్కోపిక్ పద్ధతి ద్వారా రోబోట్స్‌ని ఉపయోగించి గుండె చికిత్సలు విజయవంతం చేయొచ్చు. ఇలా చేయటం వల్ల రోగ శస్త్ర చికిత్స అయిన రెండు, మూడు రోజుల్లోనే రోగి ఇంటికి వెళ్లొచ్చు. గుండె రక్తనాళాల్లో బ్లాక్ అయినప్పుడు అక్కడ కాల్షియం పేరుకుపోయి గట్టిగా అవుతుంది. దీనినే క్రానిక్ టోటల్ ఆక్లూజన్ అంటారు. కాల్షియం పేరుకుపోతే ఎక్స్‌రే ద్వారా తెలుసుకోవచ్చు. ఇలాంటి బ్లాక్స్ దగ్గరకు గ్రైండిగ్ కేథటార్‌వైర్‌ని పంపుతాము. యాంజియో ప్లాస్టీలో టార్పస్ స్క్రూ కదలికలతో కాల్షియం గట్టిపొరను చీల్చుకుంటూ ముందుకు వెళ్లి రక్తనాళాల్లోని అడ్డంకులను తొలగించొచ్చు. గుండె కొట్టుకునే వేగం బాగా తగ్గిపోతున్నా, విఫలమయ్యే పరిస్థితి నెలకొన్నా, స్పృహతప్పే పరిస్థితి ఎదురవుతున్నా పేస్‌మేకర్లు అమర్చటం ద్వారా ఉపయోగం ఉంటుంది.

ఆత్యాధునిక వోసీటీ సేవలు

ఆంధ్రా హార్ట్ అండ్ బ్రెయిన్ ఇనిస్టిట్యూట్‌లో ఆర్టికల్ కాహెన్స్ టొమోగ్రఫీ సేవలు గత రెండేళ్లుగా అందిస్తున్నాం. ఈ పరికరంతో చేసే వైద్య సేవలు ఎంతో నాణ్యమైనవి. వోసీటీ పరికరం ద్వారా గుండె లోపలి భాగంలోని రక్తనాళాల పూడికను పసిగట్టొచ్చు. యాంజియోగ్రామ్ టెస్ట్ కంటే ఎక్కువ ఫలితాలను వోసీటీ ఇస్తుంది.


ఇంటర్వ్యూ : యడవల్లి శ్రీనివాసరావు
ఫొటోలు : టి.వి.రమణ

షూటింగ్‌లో మరో స్వర్ణం

- 10మీ. ఎయిర్ పిస్టల్‌లో పసిడి
- వుషూలో రజతం
- ఈక్వెస్ట్రియన్ కాంస్యం



10మీ. ఎయిర్ పిస్టల్ పురుషుల విభాగంలో స్వర్ణం సాధించిన సరబ్‌జోత్, శివ నర్వాల్, అర్జున్ సింగ్



వుషూలో రోషిబినాకు రజతం



ఈక్వెస్ట్రియన్‌లో అనూష్‌కు కాంస్యం

హాంగ్జౌ: షూటింగ్‌లో భారత్‌కు మరో స్వర్ణ పతకం లభించింది. గురువారం జరిగిన 10మీటర్ల ఎయిర్ పిస్టల్ పురుషుల విభాగంలో సరబ్‌జోత్ సింగ్, శివ నర్వాల్, అర్జున్ సింగ్ చీమాతో కూడిన జట్టు బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. భారత షూటర్ల త్రయం 1734.50 పాయింట్లతో అగ్రస్థానంలో నిలువగా.. చైనా జట్టు 1733.62 పాయింట్లతో రజత పతకం సాధించింది. కాగా, ఇదే విభాగంలో సరబ్‌జ్యోత్ సింగ్, అర్జున్ సింగ్ టాప్-8కు అర్హత సాధించారు. సరబ్‌జ్యోత్ 5వ స్థానంలో, అర్జున్ 8వ స్థానంలో నిలిచారు.

ఈక్వెస్ట్రియన్‌లో అనూష్ నయా చరిత్ర

ఈక్వెస్ట్రియన్‌లో వ్యక్తిగత విభాగంలో అనూష్ గార్వాలా నయా చరిత్రను లిఖించాడు. వ్యక్తిగత డ్రెస్సేజ్ విభాగంలో అనుష్ గార్వాలా 73.030 శాతం పాయింట్లతో కాంస్య పతకంతో సాధించి రికార్డును నెలకొల్పారు. ఆసియా క్రీడల వ్యక్తిగత విభాగంలో భారత్‌కు ఓ పతకం దక్కడం ఇదే తొలిసారి.

వుషూలో రోషిబినాకు రజితం..

వుషూ 60 కేజీల మహిళల విభాగంలో రోషిబినా రజత పతకం సాధించింది. 2018లో జకార్తాలో జరిగిన ఆసియా క్రీడల్లో రోషిబినా కాంస్య పతకాన్ని తొలిసారి సాధించగా.. ఈసారి అత్యుత్తమ ప్రదర్శనను కనబర్చి రజతాన్ని సాధించింది.

టెన్నిస్ ఫైనల్స్‌కు సాకేత్ జోడి..

టెన్నిస్‌లో పురుషుల డబుల్స్‌లో భారత జోడీ సాకేత్ మైనేని-రామ్‌కుమార్ రామనాథన్ ఫైనల్లోకి ప్రవేశించారు. గురువారం జరిగిన సెమీఫైనల్లో 6-1, 6-7, 10-0 తేడాతో కొరియా జోడి సోనోన్‌వూ క్వాన్, సియోంచన్‌పై విజయం సాధించారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో బొప్పన్న-భోసలే జోడి 7-5, 6-3తో 8వ సీడ్ కజకిస్తాన్ జోడిని ఓడించి సెమీస్‌కు చేరారు. టేబుల్ టెన్నిస్ పురుషుల, మహిళల జట్లు ప్రి క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించాయి. ఇక స్క్వాష్ మహిళల జట్టు పరాజయాన్ని చవిచూడగా.. పురుషుల టీమ్ విభాగంలో నేపాల్‌తో మ్యాచ్‌ను టై చేసుకోవడం ఊరటనిచ్చే అంశం. ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్‌లో ప్రణతి నాయక్ 8వ స్థానంలో నిలిచి వాల్ట్‌లో ఫైనల్లోకి దూసుకెళ్లింది.

హాకీలో జైత్రయాత్ర

పురుషుల హాకీజట్టు తన జైత్రయాత్ర కొనసాగిస్తోంది. గురువారం జరిగిన గ్రూప్-ఏ మూడో మ్యాచ్‌లో భారత్ 4-2గోల్స్ తేడాతో డిఫెండింగ్ ఛాంపియన్ జపాన్‌ను చిత్తుచేసింది. తొలి అర్ధ భాగం ముగిసే సరికే భారత్ 2-0గోల్స్ ఆధిక్యతలో నిలిచింది. దీంతో గ్రూప్-ఏలో భారత్ వరుసగా మూడు విజయాలతో అగ్రస్థానంలో నిలిచింది. గ్రూప్-ఎ, బిలలో టాప్-2లో నిలిచిన జట్లు సెమీస్‌లో తలపడనున్నాయి. 2018 జకార్తా ఆసియా క్రీడల్లో పురుషుల హాకీ జట్టు రజత పతకాన్ని సాధించింది.

4×200మీ. ఫ్రిస్టైల్‌లో జాతీయ రికార్డు

మహిళల 4×200మీ. ఫ్రిస్టైల్ రిలే స్విమ్మింగ్‌లో జాతీయ రికార్డు నమోదైంది. భారత్‌కు చెందిన ధీనిధి దేసింఘు, వృత్తి అగర్వాల్, శివాంగి శర్మ, హర్షిక రామచంద్రలతో కూడిన బృందం 4×200మీ. ఫ్రిస్టైల్‌ను 8నిమిషాల 37:58సెకన్లలో పూర్తి చేశారు. దీంతో ఇంతకుముందు నమోదైన జాతీయ రికార్డు 8నిమిషాల 39:64సెకన్లలో తుడిచిపెట్టుకుపోయింది. అలాగే ఈ ఈవెంట్‌లో 8వ స్థానంలో నిలిచి భారత స్విమ్మర్ల జట్టు ఫైనల్‌కు చేరింది.

ప్రి క్వార్టర్స్‌లో ఛెత్రీ సేన ఓటమి

భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు లీగ్ దశలోనే నిష్క్రమించింది. గురువారం సౌదీ అరేబియాతో జరిగిన ప్రి క్వార్టర్స్ పోటీలో భారత్ 0-2గోల్స్ తేడాతో పరాజయాన్ని చవిచూసింది. తొలి అర్ధభాగంలో ఇరుజట్లు గోల్ చేయడంలో విఫలమయ్యాయి. రెండో అర్ధభాగం మ్రాన్ 51వ ని. 57వ ని.లో రెండు గోల్స్ చేసి సౌదీని గెలిపించాడు.

రుతురాజ్‌కు పగ్గాలు..

ఆసియా క్రీడల పురుషుల క్రికెట్ జట్టుకు రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్‌గా, కోచ్‌గా వివిఎస్ లక్ష్మణ్ వ్యవహరించనున్నారు. రుతురాజ్ నేతృత్వంలోని భారత జట్టు గురువారం సాయంత్రం హాంగ్జౌకు బయలుదేరి వెళ్లింది. ర్యాంకుల ఆధారంగా భారత్‌పాటు బంగ్లాదేశ్, పాకిస్తాన్, శ్రీలంక జట్లు నేరుగా క్వార్టర్స్ నుంచి తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. అక్టోబర్ 3నుంచి క్వార్టర్స్, 6న సెమీస్, 7న ఫైనల్ పోటీలు జరగనున్నాయి.

అశ్విన్ ఇన్.. అక్షర్ ఔట్..

వన్డే ప్రపంచకప్ జట్టు ఇదే..



ముంబయి: ఐసిసి వన్డే ప్రపంచకప్ భారతజట్టులో రవిచంద్రన్ అశ్విన్‌కు చోటు దక్కించుకున్నాడు. బిసిసిఐ తాజాగా వన్డే ప్రపంచకప్‌లో ఆడే 15మంది ఆటగాళ్లతో జాబితాను గురువారం వెల్లడించింది. తొలి దఫా ప్రకటించిన ప్రపంచకప్ జట్టులో అశ్విన్‌కు చోటు దక్కలేదు. అక్షర్ పటేల్ తీవ్రంగా గాయపడడంతో అతని స్థానంలో అశ్విన్ చోటు దక్కించుకున్నాడు. అక్షర్ పటేల్ ఆసియాకప్ టోర్నీలో భాగంగా బంగ్లాదేశ్‌తో జరిగిన వన్డేలో తీవ్రంగా గాయపడ్డాడు. వన్డే ప్రపంచకప్ నాటికి అతడు జట్టుకు అందుబాటులో రావడం కష్టసాధ్యమయ్యే పరిస్థితుల్లో బిసిసిఐ తాజాగా అశ్విన్‌కు చోటు కల్పిస్తూ మరోదఫా జట్టును ప్రకటించింది. 2011, 2015 వన్డే ప్రపంచకప్‌లలో అశ్విన్ భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించాడు. ఈనెల 30వరకు ఆటగాళ్లను మార్పు చేసుకొనేందుకు ఐసిసి అనుతిచ్చిన సంగతి తెలిసిందే. దీంతో భారతజట్టు ముగ్గురు స్పిన్నర్లతో వన్డే ప్రపంచకప్ బరిలోకి దిగనుంది. స్పిన్నర్ల రూపంలో అశ్విన్‌తోపాటు జడేజా, కుల్దీప్ జట్టుకు అందుబాటులో ఉండనున్నారు. వన్డే ప్రపంచకప్‌లో భాగంగా భారతజట్టు అక్టోబర్ 8న ఆస్ట్రేలియాతో తొలి లీగ్ మ్యాచ్ ఆడనుంది.

జట్టు: రోహిత్(కెప్టెన్), హార్దిక్, శుభ్‌మన్, కోహ్లి, శ్రేయస్, కెఎల్ రాహుల్, ఇషాన్(వికెట్ కీపర్లు), సూర్యకుమార్ యాదవ్. జడేజా, శార్దూల్, బుమ్రా, సిరాజ్, కుల్దీప్, షమీ, అశ్విన్.

పతకాల పట్టిక

వ.స.	దేశం	స్వ	ర	కా	మొ
1.	చైనా	90	51	26	167
2.	కొరియా	24	23	39	86
3.	జపాన్	18	30	30	78
4.	ఉజ్బెకిస్తాన్	6	10	15	31
5.	ఇండియా	6	8	11	25
6.	థాయ్‌లాండ్	6	3	9	18
7.	హాంకాంగ్	5	12	15	32
8.	చైనీస్ తైపీ	4	3	6	13
9.	ఇరాన్	3	9	10	22
10.	ద.కొరియా	3	5	4	12


స్వ:స్వర్ణాలు; ర:రజితం; కా:కాంస్యం మొ:మొత్తం

క్లైమాక్స్‌లో 'గుంటూరు కారం'



మహేష్ బాబు నటిస్తున్న 'గుంటూరు కారం' చిత్రం క్లైమాక్స్ చిత్రీకరణకు చేరుకుంది. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో శ్రీలీల ప్రధాన కథానాయకురాలుగా నటిస్తున్నారు. మీనాక్షి చౌదరి మరో కథానాయకురాలిగా చేస్తోంది. సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు) నిర్మాత, థమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. తాజాగా సమాచారం ప్రకారం అన్నపూర్ణ 7 ఎకర్స్ స్టూడియోలో ఈ చిత్రం క్లైమాక్స్ సన్నివేశాలు షూటింగ్ జరుగుతున్నట్టుగా తెలుస్తోంది. ఇందులో మహేష్ బాబు, రమ్యకృష్ణ, ప్రకాష్ రాజ్, రావు రమేష్, మరికొంతమంది నటులు పాల్గొంటున్నారని, ఈ క్లైమాక్స్ చిత్రీకరణ చాలా ఆసక్తికరంగా వుండబోతోంది అని సమాచారం.

ప్రమోషన్స్ మొదలయ్యాయి



అనిల్ రావిపూడి దర్శకత్వంలో బాలకృష్ణ హీరోగా వస్తున్న 'భగవంత్ కేసరి' చిత్రం నుండి తాజాగా ఒక ప్రచార వీడియోని చిత్ర నిర్వాహకులు విడుదల చేశారు. ఇటీవలె ఈ చిత్ర షూటింగ్ పూర్తయింది. ఈ సందర్భంగా ఈ వీడియో విడుదలచేశారు. ఈ సినిమా అక్టోబర్ 19న విడుదల అవుతోంది. ఈ సినిమాలో బాలకృష్ణ కుమార్తెగా శ్రీలీల నటిస్తుండగా, కాజల్ అగర్వాల్ మరో ముఖ్య పాత్రలో కనపడనున్నారు. బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్ ఈ చిత్రంలో ప్రతినాయక పాత్ర చేశారు. ఈ సినిమాకి నిర్మాతలు హరీష్ పెద్ది, సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మించారు. థమన్ సంగీతం అందించారు.

ఆడబిడ్డకు మార్షల్ ఆర్ట్స్ అవసరం



'దేశంలో ఏదో ఓ మూలన నిత్యం మహిళలు, అమ్మాయిలు, చిన్నపిల్లలపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయి. వార్తల్లో ఇలాంటి ఘటనలు చూసిన ప్రతిసారి నా రక్తం మరిగిపోతోంది. ఈ దారుణాలు ఇంకెప్పుడు ఆగుతాయి? ప్రస్తుతం దేశంలో జరుగుతున్న దారుణాలు చూస్తుంటే ప్రతి బిడ్డకు సెల్ఫ్ డిఫెన్స్‌తో పాటు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైంది. మన భవిష్యత్ తరాల పిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది.' అని ఇన్‌స్టాలో నటి రితికాసింగ్ పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లో 12 ఏళ్ల బాలికపై జరిగిన దారుణ ఘటన నేపథ్యంలో ఆమె ఈ పోస్ట్ చేశారు. 'గురు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు రితికా పరిచయమయ్యారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68